ప్రజాశక్తి

శుక్రవారం 30 ఆగస్టు 2024 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





జ్వరపీడితులతో కిటకిటలాడుతున్న రోగులు



బందరు ఆస్పత్రిలో రోగుల అవస్థలు

- జ్వరపీడితులతో కిటకిట
- బెడ్ల కొరతతో ఇక్కట్లు
- రక్త పరీక్షల కోసం గంటల తరబడి క్యూలైన్లలో రోగులు

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

సీజనల్ వ్యాధులు విజృంభించడంతో మచిలీపట్నం సర్వజనీన ప్రభుత్వ ఆసుపత్రికి రోగుల తాకిడి భారీగా పెరిగింది. దీంతో అవసరమైన వారికి బెడ్‌లు కేటాయించలేని పరిస్థితి నెలకొంది. రక్త పరీక్షల కౌంటర్ల సంఖ్య పెంచకపోవడం రోగులను ఇబ్బందులకు గురిచేస్తోంది. వ్యాధి తీవ్రతతో నీరసంగా ఉన్న రోగులే రక్త నమూనాలను ఇవ్వడానికి గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో రోగులందరికీ మెరుగైన వైద్య సేవలు అందించడానికి వీలుగా మచిలీపట్నం సర్వజనీన ఆసుపత్రిని విస్తరించాలనే చర్చ జరుగుతోంది.

ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం వైవాక గ్రామానికి చెందిన ఎం.లక్ష్మణరావు టైఫాయిడ్, కామెర్లు వ్యాధితో బాధపడుతున్నాడు. బందరు మండలం రుద్రవరం గ్రామానికి చెందిన వరలక్ష్మి జ్వరతీవ్రతతో బాధపడుతున్నారు. స్థానికంగా వైద్యం అందించినా స్వాంతన చేకూరకపోవడంతో వీరిద్దరిని మచిలీపట్నంలోని సర్వజనీన ఆసుపత్రికి తీసుకెళ్లారు. బెడ్‌లు ఖాళీ లేకపోవడంతో ఆసుపత్రి హాలులోనే ఇద్దరికీ చికిత్స చేయడం మొదలెట్టారు. ఒకే స్టాండ్‌కు రెండు సిలైన్ బాటిళ్లను అమర్చి వీరికి చికిత్స చేస్తున్నారు. ఇది వీరిద్దరి సమస్య మాత్రమే కాదు. ఈ ఆసుత్రిలో చికిత్స పొందుతున్న పలువురు ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. మరోపక్క సీజనల్ డెంగీ, టైఫాయిడ్, చికున్ గున్యా తదితర వ్యాధులు పెరగడంతో ఆసుపత్రికి జ్వరంతో బాధపడుతూ వచ్చే పేషెంట్లకు రక్త నమూనాల పరీక్షలు చేయించడం, ప్లేట్ లెట్లు కౌంట్ చేయడం తప్పనిసరిగా (మిగతా 2లో)

ఉచితం పేరుతో దోపిడీ

- ఇసుక డంపింగ్ యార్డుల వద్ద ప్రైవేటు వ్యక్తుల దందా
- అధికారుల చేతివాటం
- 50 టన్నులకుగాను 20 టన్నులకే చలనాలు
- ఎంపి, ఎంఎల్‌ఎల పేరుతో కొన్ని వాహనాలకు ఉచితం !
- కంచికచర్ల మండలంలో లక్ష టన్నుల ఇసుక గోల్‌మాల్ ?
- విలువ రూ.3 కోట్లు పైమాటే
- నిద్రపోతున్న నిఘా

ప్రజాశక్తి - కంచికచర్ల : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం, అధికార పార్టీ నాయకుల అనుచరులు, పలు శాఖల అధికారులకు కాసులు కురిపిస్తోంది. కేవలం 50 రోజుల వ్యవధిలోనే ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల మండలంలో రూ.3 కోట్ల మేర ఇసుక గోల్‌మాల్ అయినట్లు తెలిసింది. గత ప్రభుత్వ హయాంలో జెపి వెంచర్ పేరుతో ప్రభుత్వ పెద్దలే నదుల్లో ఇసుకను కొల్లగొట్టారు. అప్పట్లో సామాన్యలకు ఇసుక కొనుగోలు భారమై నిర్మాణాలు నిలిపేశారు. నాలుగేళ్లపాటు కళ్లముందే నదుల్లో ఇసుక అక్రమ మార్గంలో తరలిపోతున్నా అప్పటి అధికార పార్టీ నాయకులే గుడ్లప్పగించి చూశారే తప్ప అడ్డుకోలేకపోయారు. ఇది కూడా ఎన్నికల్లో అప్పటి ప్రభుత్వంపై వ్యతిరేకతకు ఒక కారణంగా నిలిచింది. గత ప్రభుత్వ చేసిన తప్పులు చేయబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరిన మూడు నెలలకే వ్యవహారం పూర్తి భిన్నంగా సాగుతోంది. ఇసుక రవాణా విషయంలో స్థానిక నాయకులు, ప్రమేయంతో దోపిడీ మొదలైందని ఆరోపణలు వస్తున్నాయి.

గత ప్రభుత్వ హయాంలో డంపింగ్ యార్డు వద్ద నిల్వ చేసిన ఇసుకను రవాణా చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వినియోగదారులకు అందుబాటులో ఉండేవిధంగా టన్ను ఇసుక రూ.290 ధర నిర్ణయించింది. కంచికచర్ల మండలం కీసర వద్ద 2 లక్షల 44 వేల 554 టన్నులు, మోగులూరు వద్ద సుమారు 1.44 లక్షల టన్నుల ఇసుక నిల్వ ఉంది. డంపింగ్ యార్డుల వద్ద ఇసుక అమ్మకం బాధ్యతను రెవెన్యూ, పోలీసు, పంచాయితీరాజ్, ఎస్ఇబి, మైనింగ్ అధికారులకు ప్రభుత్వం అప్పగించింది. ఒక్కో డంపింగ్ యార్డ్‌కు ఓ అధికారిని ఇన్చార్జిగా నియమించింది. ఇక్కడే ఇసుక దోపిడీ మొదలవుతోంది. కీసర యార్డు వద్ద అధికార పార్టీ ప్రజాప్రతినిధుల పేరుతో వారి అనుచరులే దందా సాగిస్తున్నారు. అధికారులు నడపాల్సిన యార్డు ప్రైవేటు వ్యక్తుల కనుసన్నల్లో నడుస్తోంది. ఎంపి, ఎంఎల్‌ఎల అనుచరుల పేరుతో ప్రతి రోజూ సుమారు 100 లారీలు, 50కి పైగా

కంచికచర్ల మండలం కీసర వద్ద ఇసుక డంపింగ్ యార్డ్ వద్ద లారీలు



ట్రాక్టర్లకు ఎలాటి చలానా చెల్లించకుండా, సీరియల్ నెంబరు లేకుండా పరిమితికి మించి ఇసుక లోడింగ్ జరుగుతున్నట్లు తెలిసింది. టన్ను ఇసుక ధర రూ.290 చొప్పున 5 టన్నుల ట్రాక్టర్లకు రూ.1450, ఇరవై టన్నుల లారీకి రూ.5800 చొప్పున చలానా చెల్లించిన వాహనాలకే లోడ్ చేయాలి. కానీ అలా జరగడంలేదు. అధికార పార్టీ నాయకుల వాహనాలకు ఎలాటి నగదు చలానా లేకుండా 20 టన్నుల లారీకి 50 టన్నుల వరకు లోడింగ్ చేస్తున్నారు. కొందరైతే 20 టన్నుల ఇసుకకు చలానా కట్టి 50 టన్నుల ఇసుక లోడింగ్ చేస్తున్నారు. ఈ ఇసుక రాష్ట్ర సరిహద్దు దాటిపోతోంది. ఇటీవల తెలంగాణలో పట్టుబడిన ఇసుక లారీలే ఇందుకు ఉదాహరణ. ఇప్పటివరకు కీసర ఇసుక డంపింగ్ యార్డ్ నుండి అధికారిక లెక్కల ప్రకారం 80,335 టన్నుల ఇసుక విక్రయించగా, ప్రభుత్వానికి చలానా రూపంలో రూ.2.33 కోట్లు జమ చేసినట్లు అధికారులు తెలిపారు. అధికారిక లెక్కల ప్రకారం ఇంకా 1.60 లక్షల టన్నుల ఇసుక నిల్వ ఉండాలి. కానీ డంపింగ్ యార్డ్ వద్ద సుమారు 60 వేల నుండి 80 వేల టన్నుల ఇసుక మాత్రమే ఉంటుందని, మిగతా సుమారు లక్ష టన్నుల ఇసుక ఏమైందో తెలియని పరిస్థితి నెలకొంది. అలాగే మోగులూరు యార్డు వద్ద కూడా పరిస్థితి ఇలానే ఉంది. ఈ రెండు యార్డుల వద్ద సూమారు లక్ష (మిగతా 2లో)

సురక్షిత మంచినీరు సరఫరా చేయాలి

ఎ.కొండూరు కిడ్నీ బాధితుల సమస్యలపై సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విజయవాడ : నెల రోజుల్లో ఎ.కొండూరు ప్రాంతంలోని కిడ్నీ బాధిత ప్రాంతాలకు సురక్షిత మంచినీరు అందజేయాలని, కిడ్నీ వ్యాధితో మరణించిన బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ డిమాండ్ చేశారు. లేకపోతే చలో అమరావతి నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎ.కొండూరు, గంపలగూడెం మండలాలకు కృష్ణా జలాలను సరఫరా చేయాలని, కొండపల్లి, ఇబ్రహీంపట్నం ప్రారిశ్రామిక కాలుష్యాన్ని నివారించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 27న సిపిఐ ఆధ్వర్యాన ఎ.కొండూరులో ప్రారంభమైన పాదయాత్ర గురువారం విజయవాడ చేరుకుంది. ఈ సందర్భంగా లెనిన్ సెంటరులో జరిగిన బహిరంగ సభలో రామకృష్ణ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలు పోతున్నా కిడ్నీ బాధితుల వ్యధలు పాలకులకు పట్టడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కూత వేటు దూరంలో కష్ణాజలాలు వున్నా సరఫరా చేసే నాధుడే కరువయ్యాడని విమర్శించారు. తిరువూరు నియాజకవర్గంలో గత ఐదేళ్లలో 300మందికి పైగా ప్రాణాలు విడిచారని తెలిపారు. వందలాది మంది ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారని వివరించారు.

సిపిఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న మంచినీరు కూడా కలుషితం అవుతోందన్నారు. కనీసం నెలలో ఒక్కసారి కూడా మంచినీటిలో క్లోరిన్ కలపడంలేదన్నారు. కొండపల్లి, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో 2 వేల వరకు చిన్న తరహా, మధ్యతరహా, భారీ పరిశ్రమలు ఉన్నాయన్నారు. వీటి నుంచి వెలువడుతున్న వాయు కాలుష్యం ప్రజల ఆరోగ్యాన్ని హరించివేస్తోందన్నారు. విటిపిఎస్ నుండి వెలువడుతున్న బూడిదతో కాలుష్యం ఏర్పడుతోందన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, జి.ఓబులేసు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. పాదయాత్ర అనంతరం జాయింట్ కలెక్టర్‌ను కలిసి కిడ్నీ బాధితుల సమస్యలపై నేతలు వినతిపత్రం సమర్పించారు.

జెసికి వినతిపత్రం అందిస్తున్న సిపిఐ నేతలు కె.రామకృష్ణ, దోనేపూడి శంకర్ తదితరులు



గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల వసతి గృహం విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కృష్ణాజిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల బాలికల వసతి గృహం విద్యార్థినులు ఆందోళనకు దిగారు. వసతి గృహం బాత్‌రూంలో విద్యార్థునులు స్నానం చేస్తున్న దశ్యాలను ఓ విద్యార్థిని వీడియోల తీసి బాలుర వసతి గృహంలోని ఓ విద్యార్థికి పంపుతున్నట్లు గుర్తించి గురువారం రాత్రి ఆందోళనకు దిగారు. వసతి గృహం వద్ద నిరసనకు దిగారు. గత రెండేళ్లుగా ఈ వ్యవహారం నడుస్తోందని, దీనిపై తమకు న్యాయం చేయాలని విద్యార్థునులు డిమాండ్ చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

నేడు సుద్దాల అశోక్ తేజ 'శ్రమకావ్యం' గానం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కష్టజీవుల ఐక్యతే లక్ష్యంగా సంపద సష్టించే వర్గం కోసం ప్రముఖ సినీ గేయ రచయిత, జాతీయ అవార్డు గ్రహీత సుద్దాల అశోక్ తేజ రచించిన 'శ్రమకావ్యం' గానం శుక్రవారం సాయంత్రం 5.30 గంటలకు జరుగుతుందని జాషువా సాంస్కతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ గవర్నరుపేట రాఘవయ్యపార్క్ సమీపంలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) ఎసి ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమంలో సుద్దాల అశోక్ తేజ తన పాటలు, వచనంతో ప్రసంగిస్తారని తెలిపారు.

వాడవాడలా గిడుగు జయంతి

మాతృభాష దినోత్సవం, తెలుగు భాష వైతాళికుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు 161వ జయంతి వేడుకలు గురువారం వాడవాడలా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో వక్తలు మాట్లాడుతూ గిడుగు అనుసరించిన బాటలో ప్రతి ఒక్కరూ పయనిస్తూ ప్రతి క్షణం తెలుగు ఔన్నత్యం కోసం పాటుపడాలని కోరారు. ఇంగ్లీషు, ఇతర భాషలు నేర్చుకుంటున్నప్పటికీ... తెలుగు భాష సజీవంగా నిలబడాలన్నా... వికసించడానికి ప్రతి ఇంట్లో పిల్లలతో కుటుంబ సంబంధ బాంధవ్యాలను, తినే పదార్థాలను తెలుగు పదాలతోనే తల్లిదండ్రులు ప్రాథమికంగా నేర్పించాలని కోరారు.

వార్తలు లోపలి పేజీల్లో



విజయవాడ బాలోత్సవ్ భవన్లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న పి.మధు

ప్రమాణాలు పాటించని బ్లడ్ బ్యాంక్‌లు

20 రోజుల్లో రెండు ప్రాణాలు బలి

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) : సరైన ప్రమాణాలు పాటించని బ్లడ్ బ్యాంక్‌లు, పర్యవేక్షణ లేని అధికారుల నిర్వాకంతో ప్రజల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. కృష్ణాజిల్లా కేంద్రమైన మచిలీపట్నం ఐదు రోడ్ల సెంటర్లో ఈనెల 7న ప్రారంభించిన విజయ బ్లడ్ బ్యాంక్ సరైన ప్రమాణాలు పాటించని కారణంగా 20 రోజులు గడవక ముందే రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిసి పోయిన ఘటన నగరంలో చర్చనీయాంశంగా మారింది. అభంశుభం ఎరుగని 13 ఏళ్ళ బాలిక, 43 ఏళ్ల వ్యక్తి ఈ బ్లడ్ బ్యాంక్ నిర్వాకంతో ప్రాణాలు విడిచినట్లు తెలిసింది. డబ్బుల సంపాదనే ధ్యేయంగా కొన్ని బ్లడ్ బ్యాంకులు పనిచేస్తున్నాయి. నగరంలో ప్రభుత్వ బ్లడ్‌బ్యాంకు, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకుతోపాటు రెండు ప్రైవేటు బ్లడ్ బ్యాంకులు ఉన్నాయి. ఇక్కడ ఇన్చార్జి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉన్నారు. అయితే 20 రోజుల వ్యవధిలో విజయ బ్లడ్ బ్యాంక్ నుండి తీసుకువచ్చిన ప్లేట్‌లెట్స్ ఎక్కించడంతో ఒకే ఆస్పత్రిలో ఇద్దరు ప్రాణాలు విడిచినట్లు తెలిసింది. ఈ బ్లడ్ బ్యాంక్‌లో సరైన పరికరాలు సైతం లేకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనికి లైసెన్సు ఇచ్చిన అధికారులపై, పొందిన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం : డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ

బ్లడ్ బ్యాంక్ బాధ్యతా రాహిత్యంతో రెండు ప్రాణాలు గాలిలో కలిసిపోయాయన్న విషయం బయటకు పొక్కటంతో గురువారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గోపాల కష్ణ ఆ బ్లడ్ బ్యాంకును తనిఖీ చేశారు. విజయ బ్లడ్ బ్యాంక్లో లోపాలు గుర్తించామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. వారి ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్యారేజికి మళ్లీ వరద

ప్రజాశక్తి - విజయవాడ : ప్రకాశం బ్యారేజికి మళ్లీ వరద నీరు చేరింది. గురువారం రాత్రి ఏడు గంటల సమయానికి ప్రకాశం బ్యారేజికి 2,03,204 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఈ నీటిలో 1,85,975 క్యూసెక్కుల నీటిని బ్యారేజికి చెందిన మొత్తం 70 గేట్లలో 65 గేట్లను నాలుగు అడుగుల మేర, మరో ఐదు గేట్లను మూడు అడుగుల మేర ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. కాల్వలకు 17,229 క్యూసెక్కుల నీటిని ఇరిగేషన్ అధికారులు మళ్లిస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద నీటి మట్టం 12 అడుగులుగా ఉంది.

సిఎం చంద్రబాబుకు కలెక్టర్ డాక్టర్ సృజన స్వాగతం

ప్రజాశక్తి-విజయవాడ : తెలుగుభాషా దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు గురువారం సాయంత్రం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రానికి వచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్‌కు ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన ఘన స్వాగతం పలికారు. వారిని పుష్పగుచ్ఛం అందజేశారు.





ఎకెటిపిలో నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఎకో క్లబ్ ఏర్పాటు

విజయవాడ : సత్యనారాయణపురంలోని ఎకెటిపిఎం ఉన్నత పాఠశాలలో హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఎకో క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ మామిడి శ్రీనివాస రావు మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణ ఏ విధంగా చేయాలి, పాఠశాలలోనూ, ఇంటి వద్ద మొక్కలను నాటడమే కాకుండా వాటిని తదనంతరం కూడా ఎలా పరిరక్షించాలనే విషయాలను వివరించారు. పాఠశాల బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులు శివ, హ్యాపీ లైఫ్ ఫౌండేషన్ సహ అధ్యక్షులు దేవరపల్లి సురేష్ మాట్లాడారు. నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఎకో క్లబ్ కమిటీకి ఎన్నికైన బాల బాలికలకు గ్రీన్ కోర్ టీ షర్టులు అందించారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి సీతారామారావు పాల్గొన్నారు.



పిడిఎస్‌ఓ నిరసన



ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పిడిఎస్‌ఓ) ఆధ్వర్యంలో గురువారం బందర్ రోడ్డు లోని బాలోత్సవ భవన్‌లో రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. పిడిఎస్‌ఓ రాష్ట్ర కోశాధికారి ఎల్.భాను అధ్యక్షత జరిగిన ఈసమావేశంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యాయ పత్రిక ప్రధాన సంపాదకులు ఎస్.కె.జిలాని మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో స్త్రీ విముక్తి సంఘటన రాష్ట్ర అధ్యక్షులు సి.విజయ, పిడిఎస్‌ఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ సురేష్, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం బాలోత్సవ భవన్ నుండి బీసెంట్ రోడ్డు మీద గా లెనిన్ సెంటర్ వరకు నిరసన ప్రదరశన నిర్వహించారు.

మొదటిపేజీ తరువాయి

బందరు ఆస్పత్రిలో రోగుల అవస్థలు

మారింది. బెడ్‌ల దగ్గరకు వెళ్లి రక్త నమూనాలు సేకరించే పరిస్థితి ఆసుపత్రిలో లేదు. దీంతో పరీక్షా కేంద్రం వద్ద రక్త నమూనాలను ఇవ్వడానికి గంటల తరబడి పేషెంట్లు నిరీక్షించాల్సి వస్తోంది. మరోపక్క వ్యాధిగ్రస్తులకు సహాయకులుగా వచ్చేవారికి వెయిటింగ్ హాలు లేదు. ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ ఆసుపత్రి లోపల, వెలుపల చెట్లకింద కూర్చుని రోగులు ఫోన్ చేసిన వెంటనే వారికి సహాయాన్ని అందించడానికి బెడ్ దగ్గరకు వెళ్లాల్సి వస్తోంది.

ఆసుపత్రి విస్తరణతోనే సమస్య పరిష్కారం!

మచిలీపట్నంలోని జిల్లా ఆసుపత్రిని ఏడాదిన్నర క్రితం మెడికల్ కళాశాలకు అనుబంధంగా సర్వజనీన ఆసుపత్రిగా మార్చారు. 26 విభాగాల్లో వైద్యరంగంలోని ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయిలోని వారు వైద్య సేవలు అందిస్తున్నారు. మంచి వైద్యం అందుతోందనే ప్రచారం జరగడంతో రోజువారీ ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలతోపాటు ఏలూరు జిల్లా కైకలూరు, బాపట్ల జిల్లా రేపల్లి తదితర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వస్తున్నారు. గతంలో రోజూ ఓపి 500 ఉండగా సర్వజనీన ఆసుపత్రిగా మారిన తర్వాత 800కు పెరిగింది. సీజనల్ వ్యాధుల కారణంగా ఇటీవల ఈ సంఖ్య మరింత పెరిగింది. నీరసించిన వారిలో ఎక్కువ మందిని ఇన్‌పేషెంట్లుగా చేర్చుకొని సేవలు అందించాల్సి వస్తోంది. ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో 550 బెడ్లు ఉన్నా చాలడం లేదు. జిల్లా కేంద్రంలోని సర్వజనీన ఆసుపత్రిని విస్తరించి కనీసం 1000 పడకలు ఏర్పాటు చేయడంతోపాటు రోగులు ఇబ్బంది పడకుండా రక్త, ఇతర వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహణలకు, వైద్య సేవలకు అవసరమైన సిబ్బందిని నియమించాల్సిన అవసరం ఉంది.



సర్వజనీన ఆసుపత్రికి రోగులు పెరిగారు

ఎన్.వి.సుందరాచారి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

జిల్లా ఆసుపత్రి... మెడికల్ కళాశాలకు అనుబంధంగా సర్వజనీన ఆసుపత్రిగా మారిన తర్వాత రోగుల తాకిడి పెరిగింది. ఆసుపత్రికి వచ్చే వారికి ఎటువంటి సమస్యలు లేకుండా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నాం. ఒక్కోసారి బెడ్ల సమస్య ఎదురవుతోంది. అందరికీ సర్దుబాటు చేస్తున్నాం.

ఉచితం పేరుతో దోపిడీ

టన్నుల ఇసుక గోల్‌మాల్ జరిగినట్లు ప్రజలు ఆరోపిస్తున్నారు.

దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరితే... తమకేమీ తెలియదని చెబుతున్నారు. కీసర డంపింగ్ యార్డు వద్ద 2.44 లక్షల టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్లు జిల్లా కలెక్టర్ మొదట్లో ప్రకటించారు. అది కేవలం కాగితంపై ఉన్న లెక్కలేనని, అంత ఇసుక నిల్వలేదని డంపింగ్ యార్డు ఇన్చార్జి అధికారి పేర్కొటం కొసమెరుపు. ఇసుక డంపింగ్ యార్డుల వద్ద ఇంత దోపిడీ జరుగుతున్నా ఇంటెలిజెన్స్ అధికారులు ఏమీ తెలియనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఒకవేళ నిఘా అధికారులు నివేదికను ఇచ్చినా ప్రభుత్వం బుట్ట దాఖలు చేసిందా అన్న సందేహం కూడా కలుగుతోందని ప్రజలు చర్చించుకుటున్నారు.

'వనం-మనం' వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బాలాజీ, అధికారులు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : వనం-మనం కార్యక్రమంలో భాగంగా ఈనెల 30వ తేదీ శుక్రవారం జిల్లావ్యాప్తంగా 20 వేల మొక్కలను నాటేందుకు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ వన మహోత్సవం వనం-మనం కార్యక్రమం పై సంబంధిత అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించి వాల్‌పోస్టర్ విడుదల చేశారు. సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 30వ తేదీ నుండి మొక్కలు నాటే కార్యక్రమంతో ప్రారంభించి నవంబర్ నెల వరకు కొనసాగించాలన్నారు. ఈనెల 30వ తేదీన ఒక రోజే జిల్లా వ్యాప్తంగా 20వేల మొక్కలను నాటేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలు తదితర విద్యాసంస్థల్లో, దేవాలయాలు చర్చిలు, మసీదులు తదితర ప్రార్థన మందిరాలలో మొక్కలను విరివిగా నాటి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వామ్యులుగా చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఎఫ్ఓ రాజశేఖర్, జడ్పీ సీఈవో ఆనందకుమార్ కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ శోభన్ బాబు, మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, డి ఐ ఈ ఓ సాల్మన్ రాజు, డిపిఓ నాగేశ్వర్ నాయక్, డ్వామా పిడి సూర్యనారాయణ పాల్గొన్నారు.

వెంకటరావుకు క్రీడా ప్రతిభా అవార్డు

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం గ్రామానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు జల సూత్రం వెంకటరావుని జిల్లా క్రీడా ప్రతిభ అవార్డు వరించింది. ఈ సందర్భంగా గురువారం డీఈవో కార్యాలయంలో రాష్ట్ర వ్యాయామ విద్య సంచాలకులు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వి భానుమూర్తి రాజు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటరావుని అంతర్జాతీయ షూటింగ్ బాల్ క్రీడాకారుడు విజయకుమార్ గోవులమూడి, యునైటెడ్ ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ సంస్థ అధినేత బుల్లెద్దు భాగ్యరాజు, గన్నవరం వ్యాయామ ఉపాధ్యాయ మిత్రమండలి అభినందించారు.

సేంద్రీయ వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి గూడూరు : రాష్ట్ర వ్యాప్తంగా సుమారు పది లక్షల ఎకరాలలో సేంద్రియ వ్యవసాయం చేయాలనే లక్ష్యంతో రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి కె. పార్థసారధిరావు తెలిపారు. గురువారం గూడూరు మండలం అనంతాయపేట గ్రామం లో వ్యవ సాయ శాఖ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విచ్చలవిడిగా ఎరువులు పురుగు మందులు వాడి ఆర్థికంగా, ఆరోగ్యం పరంగా నష్టపోతున్నారని, అవసరం మేరకు మాత్రమే జీవ సంబంధ పురుగు మందులు వేపనూనె, ఆవు మూత్రం,ఆవుపేడ మాత్రమే వాడాలని తెలియచేసారు. తినే ఆహారం లో పురుగు మందుల అవశేషాలు వుండటం వలన చిన్న వయసు లోనే కాన్సర్ వంటి ప్రాణంతక వ్యాధులు రావటం, ఆయుష్షు కూడా క్షీనించటం జరుగుతున్న పరిస్థితి లో రైతులు సేంద్రియం వైపు మొగ్గు చూపాలన్నారు. జిల్లా వనరుల కేంద్రం ఎ డి ఎ శ్రీనివాస్, ఎఒలు శివప్రసాద్, పద్మజ, రైతులు వెంకటరెడ్డి, కుటుంబరావు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో డెంగ్యూ కిట్ల కొరత



ప్రజాశక్తి- ఉయ్యూరు : ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెంగ్యూ కిట్స్ లేక జ్వరాలతో బాధ పడే రోగులు పరీక్షలు చేయించుకునేందుకు రోజులతరబడి ఎదురు చూస్తున్నారు. ఉయ్యూరు, మండల పరిధి గ్రామాల్లో టైఫాయిడ్, డెంగ్యూ, విషజ్వరాలతో బాధ పడుతూ రోగులు ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యఖర్చులు భరించలేక చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ఈపరిస్థితుల్లో రోగులకు వైద్య పరీక్షలు చేసి వ్యాది నిర్ధారణ చేసేందుకు డెంగ్యూ కిట్స్, ఇతర పరీక్షలకు అవసరమైన కిట్లు అందుబాటు లేకపోవడంతో ప్రైవేట్ ల్యాబ్లకు వెళ్లి పెద్దమొత్తంలో డబ్బు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ఉయ్యూరులో వైద్య విధాన పరిషత్ సీహెచ్సీతో పాటు మండలంలో చినఓగిరాల, కా టూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వ్యాది నిర్ధారణ పరీక్షలు చేసేందుకు కిట్లు లేక వాటి కోసం ఎదురు చూస్తున్నారు. దీనిపై ఉయ్యూరు వైద్యశాల సూపరిం టెండెంట్ పి. మురళీని వివరణ కోరగా కిట్లు అయిపోయి నాలుగు రోజులవుతుందని వీటికోసం పైఅ దికారులకు పరిస్థితి తెలియచేశామన్నారు.

నూతన బస్సులు ప్రారంభం

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాబోయే కాలంలో అవనిగడ్డలో ఆర్టీసీ డిపో అభివద్ధికి అన్ని విధాల కషి చేస్తానని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ హామీ ఇచ్చారు. గురువారం డిపోలో నూతన బస్సుల ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బస్సులను ప్రారంభించి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ అవనిగడ్డ ఆర్టీసీ డిపో ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలు అందే విధంగాను గ్రామాలకు సైతం బస్ సర్వీసులు నడిపేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా డిపో కి కేటాయించిన రెండు ఎక్స్ప్రెస్ బస్సులను బుద్ధ ప్రసాద్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి వాణిశ్రీ, డిపో మేనేజర్ కే హనుమంతరావు, అసిస్టెంట్ మేనేజర్ సిహెచ్ శ్రీలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ దివ్య పాల్గొన్నారు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-గన్నవరం : నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో బాపులపాడు మండలం వీరవల్లి గ్రామం లోని రాజీవ్ గాంధీ కాలనీ లోని అంగన్‌వాడి సెంటర్‌లో మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ ఎస్. జాకబ్ రాజు మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించించడం వలన భవిష్యత్తు అంధకారం అవుతుందన్నారు. నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ డి విజయరాణి, అంగన్ వాడి ప్రాజెక్ట్ లీడర్ రమాదేవి, వీరవల్లి సెక్టార్ విభాగాల టీచర్స్ తదితరులు పాల్గొన్నారు

సిఎతో ఉపాధి అవకాశాలు



ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : చార్టెడ్ అకౌం టెంట్ (సిఎ) చదివిన విద్యార్ధులకు విశాలమైన అవకాశాలు వున్నాయని ప్రముఖ ఆడిటర్ ఆకెళ్ళ పవన్ తెలిపారు. మచిలీపట్నంలోని స్థానిక నోబుల్ కళాశాల లో గురువారం ఇన్స్టిట్యూట్ అఫ్ చార్టెడ్ ఎకౌంటెంట్స్ విజయ వాడ బ్రాంచ్ వారి అధ్వర్యం లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆకెళ్ళ పవన్, విజయవాడకు చెందిన అత్కూరి కిషోర్ (ఆడిటర్) రిసోర్స్ పర్సన్ లు వచ్చి పాల్గొని మాట్లాడారు. చార్టెడ్ అకౌంటెంట్ సాధించడం కొంత వరకు కష్టమైని ప్రక్రియ అయినప్పటికీ చాల విశిష్టమైన, విశాలమైన వృత్తి అన్నారు. దేశంలో చార్టెడ్ ఎకౌంటెంట్‌ల కొరత వున్నదని తెలిపారు. ఇంటర్మీడియట్ ,డిగ్రీ తర్వాత సి ఎ చదవవచ్చని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎస్ జే ఎర్నెస్ట్ అధ్యక్షత జరిగిన ఈ సదస్సులో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

ప్రజాశక్తి-ఉంగుటూరు : రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలుగుదేశం పార్టీ ఉంగుటూరు మండల అధ్యక్షులు ఆరుమళ్ళ వెంకట కృష్ణారెడ్డి అన్నారు. గురువారం ఉంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రోగులకు అందుతున్న వైద్యసేవలు పిహెచ్‌సిలో రోగులకు అవసరమైన మందులు, వైద్య పరికరాలు సిబ్బంది పనితీరు తదితర అంశాలపై పి హెచ్ సి వైద్యులు డాక్టర్ భవానిని అడిగి తెలుగసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఈడుపుగంటి కష్ణమూర్తి, తొమ్మండ్రు సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

చెత్త డంపింగ్ యార్డ్‌కు స్థలం కేటాయించాలి : సిపిఎం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం పంచాయతీలో చెత్త సేకరణ సక్రమంగా చేయడం లేదని, చెత్త పోయడానికి స్థలం లేకపోవడమే దానికి కారణమని జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి డంపింగ్ యార్డ్ కు రెండు ఎకరాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సిపిఎం గన్నవరం మండల కార్యదర్శి ఆంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ చెత్తను ఎక్కడ పడేయాలో తెలియక గన్నవరం పంచాయతీ జనాలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చెత్త డంపింగ్ యార్డ్ కేటాయింపుకు జిల్లా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చెత్త సేకరించడంలో అధికారులు పేదల పేటలను విస్మరించడం సరి కాదని పేర్కొన్నారు. పంచాయతీ పరిధిలో 70 మంది పారిశుద్ధ్య కార్మికులున్నారని, పట్టణంలో 20 వార్డులు ఉండగా రోజుకు 7 ట్రాక్టర్ల చెత్త సేకరిస్తున్నారని తెలిపారు. ఈ చెత్తను గొల్లనపల్లి పరిధిలో ఉన్న వారి గోతుల్లో పోయడానికి అనుమతి ఇచ్చినా స్థానికులు వ్యతిరేకించడంతో పరిస్థితి రివర్స్ అయిందన్నారు. ఆగిరిపల్లి రోడ్డు లో పోస్తే ఊరుకోమని రైతుల అడ్డం తిరుగుతున్నారని ఈ నేపథ్యంలో పరిశుద్ధ కార్మికులు చెత్తను రోడ్ల పక్కన వేసి తగలబెడుతున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పారిశుద్ధ్య పరిస్థితులను మెరుగు పర్చడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.


జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి-ఉయ్యూరు : కాటూరులో పేకాట శిబిరంపై ఉయ్యూరు రూరల్ పోలీసులు గురువారం దాడిచేసి ముగ్గురిని అరెస్టుచేసి వారివద్దనుంచి రూ.3,050 నగదు స్వాధీన పరచుకున్నారు. గ్రామ పరిధిలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం మేరకఉ సిబ్బందితో కలసి దాడి చేయగా పేకాట ఆడుతున్న ముగ్గురుని పట్టుకుని వారిపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై కొండపల్లి సురేశ్ బాబు తెలిపారు. పేకాట, కోడి పందేలపై సమాచారం అందిం చాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని విజ్ఞప్తిచేశారు.

మద్యం సీసాలు స్వాధీనం


ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రభుత్వ దుకాణాల్లో లభించే మద్యంతో అక్రమ వ్యాపారం చేస్తే చర్యలు తప్పవని చల్లపల్లి ఎస్ఐ పి.ఎస్.వి సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. గురువారం చల్లపల్లి మండలం లక్ష్మీపురం శివారు రామానగరం గ్రామంలో పరిసే రాంబాబు తన ఇంటి వద్ద అక్రమంగా మద్యం సీసాలు అమ్ముతున్నట్లు తెలిసి అతన్ని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.2,400 విలువైన 16 మద్యం సీసాలను స్వాదీన పరచుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గుడ్లవల్లేరు ఎస్ఐగా సత్యనారాయణ



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు పోలీస్‌స్టేషన్ నూతన ఎస్ఐగా ఎన్‌వివి సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గత సార్వత్రిక ఎన్నికల విధుల్లో భాగంగా కాకినాడ నుండి కృష్ణాజిల్లా క్రైమ్ రికార్డ్ బ్యూరోగా బదిలీపై రాగా ప్రస్తుతం సాధారణ బదిలీలు భాగంగా గుడ్లవల్లేరు ఎస్ఐగా గురువారం భాద్యతలు స్వీకరించారు. ఆయనను ఏఎస్ఐ సారధిబాబు, సిబ్బంది స్వాగతం పలుకుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఇప్పటివరకు ఎస్సైగా పనిచేసిన జి సత్యనారాయణ పెడన పీఎస్ కు బదిలీ అయ్యారు.

బాలుడికి ఎస్ఐ రక్తదానం



బాలుడితో ఎస్ఐ అర్జున్ రాజు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు : గొర్రెపోతుల దాడిలో గాయపడిన బాలుడికి అత్యవసర పరిస్థితుల్లో రకదానం చేసి ప్రాణా పాయ పరిస్థితి నుండి తప్పించిన తోట్లవల్లూరు ఎస్సై అర్జున్ రాజుని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు అభినందించారు. వివరాల్లోనికి వెళ్తే తోట్లవల్లూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని పెనమకూరు గ్రామానికి చెందిన గంట ధర్మేంద్ర మూడు సంవత్సరాల వయసు కలిగిన తన కుమారుడైన అభినయ్‌ను వెంటబెట్టుకొని బుధవారం ఉదయం వీధిలోనికి వెళ్ళాడు. అదే సమయంలో రెండు గొర్రెపోతులు పరస్పరం దెబ్బలాడుకుంటూ అక్కడే ఆటలాడుకుంటున్న ఆ బాలుడు మీద పడడంతో బాలుడికి గాయాలయ్యాయి. అభినయ్ ను ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తల్లిదండ్రులు తీసుకొని వెళ్లారు. వెంటనే సమాచారం తెలుసుకున్న తోట్లవల్లూరు ఎస్సై ఈ ఘటనపై కేసు నమోదు చేసి, తదుపరి బాలుడు ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి వెళ్లారు. బాలుడికి గాయాలవ్వడంతో రక్తదాతల కోసం ఎదురుచూస్తున్న తల్లిదండ్రుల బాధను గమనించిన ఎస్ఐ అర్జున్ రాజు బాలుడికి రక్తదానం చేసి తన మానవత్వాన్ని చాటుకున్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-ఉయ్యూరు : సమాజంలో విద్యాభివృద్ధికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృషిచేస్తుందని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు సాకి రాజేశ్, కొలసాని రవికుమార్ అన్నారు. ఉయ్యూరుకు చెందిన 5, 8 తరగతులు చదువుతున్న ఇద్దరు పాఠశాల విద్యార్థులకు ఫీజుల నిమిత్తం సంస్థ ద్వారా రూ.15 వేల ఆర్థిక సాయం గురువారం అందజేశారు. విద్యార్థుల తండ్రి సంవత్సర కాలంనుంచి అనారోగ్యానికి గురైన నేపథ్యంలో పాఠశాల పీజులు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్న పరిస్థితుల్లో స్పందించిన మానవత సంస్థ ఆర్థిక సాయం అందచేశారు. నాగకుమార్, అనిల్ కుమార్, పారుపూడి శివకృష్ణ పాల్గొన్నారు.

సైన్స్ సంబరాల గోడపత్రిక ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: విద్యార్థుల్లో సజనాత్మకతను పెంపొందించేందుకు, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నట్లు జనవిజ్ఞాన వేదిక నాయకులు తెలిపారు. కొండపల్లి పట్టణంలోని డాక్టర్ మోహన్ రావు మెమోరియల్ ట్రస్ట్ హాస్పిటల్‌లో చెకుముకి సైన్స్ సంబరాల గోడ పత్రికను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సైన్స్ పట్ల అభిరుచిని కలిగించే విధంగా జేవివి వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఏటా నిర్వహించినట్లే ఈ ఏడాది సెప్టెంబర్ 25 న పాఠశాల స్థాయి, అక్టోబర్ 1న మండల స్థాయి, అక్టోబర్ 27 న జిల్లాస్థాయి, నవంబర్ 9, 10 తేదీల్లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. చెకుముకి సైన్స్ సంబరాల్లో 8, 9, 10 తరగతుల (తెలుగు, ఇంగ్లీష్ మీడియం) విద్యార్థులు పాల్గొన వచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక కొండపల్లి పట్టణ కమిటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ మామిడి శీతారామారావు, జేవివి జిల్లా అధ్యక్షులు వెనిగళ్ల మురళీమోహన్, ఉపాధ్యక్షుడు పెట్ల కామేశ్వరరావు, జేవివి కొండపల్లి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.నాగరాజు, ఎస్ కె.సర్దార్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

వాటర్ ట్యాంకు ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని రావిరాల గ్రామంలో సిఎస్‌ఆర్ ఫండ్స్, రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ సౌజన్యంతో గ్రామంలో వాటర్ ట్యాంక్ నిర్మాణం, ఎంపీపీ స్కూల్ ప్రహరి గోడ నిర్మాణం చేపట్టడం జరిగింది. శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ వారి యాజమాన్యం వారితో కలిసిరిబ్బన్ కటింగ్ చేసి వాటర్ ట్యాంక్‌ను గురువారం ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ స్కూల్లో ప్రహరీ గోడ నిర్మాణాన్ని పరిశీలించి స్కూలు పిల్లలకు బిస్కెట్లు, జ్యూస్ అందజేశారు. అలాగే మండలంలోని ధర్మవరప్పాడు తండా గ్రామంలో సుమారు 15 లక్షల రూపాయలతో నిర్మించిన వాటర్ ట్యాంక్‌ను, శ్మశాన వాటికలో దహన సంస్కారాలు అనంతరం జరుగు కార్యక్రమాలకు ఉపయోగపడే షెడ్డును ఎమ్మెల్యే రాంకో ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు.



ఎస్ఐకు అభినందనలు

ప్రజాశక్తి-వీరులపాడు: వీరులపాడు ఎస్ఐగా బాధ్యత చేపట్టిన జిఅనిల్‌కుమార్‌ను టిడిపి నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. మండలంలో సమస్యలను శాంతియుతంగా పరిష్కరించాలని ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్‌గా ఉండేటట్టు చూడాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్ర కోసం అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కె.శ్రీనివాసరావు,కె.కుటుంబరావు, చల్లా శ్రీనివాసరావు, అప్పసాని పుల్లారావు, గురజాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-మైలవరం: సామాజిక విద్య, వైద్య రంగాల అభివద్ధికి ప్రభుత్వాలు చేస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ సూచించారు. స్థానిక లీలావతి గిరిజన పాఠశాల లోని విద్యార్థులకు గురువారం ఏకరూప దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివి మంచి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉడత లక్ష్మీనారాయణ, కార్యదర్శి రాధాకుమారి, సుధాకర్, లంక లితీష్ పాల్గొన్నారు.

డ్రైవర్లు, విద్యార్థులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి-మైలవరం: ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు, విద్యార్థులకు భద్రత, డ్రైవింగ్, యూనిఫామ్ ధరించటం, సరైన రికార్డులు నిర్వహణ తదితర అంశాలపై గురువారం సీఐ దాడి చంద్రశేఖర్ కౌన్సిలింగ్ నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో, ట్రాక్టర్ డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడపరాదని మితిమీరిన వేగం ప్రాణాలకే నష్టమని సూచించారు. వాహనాలకు సంబంధించి రికార్డులు సక్రమంగా ఉండాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆటో ట్రాక్టర్ల డ్రైవర్లు విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సి సందర్శన

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కుటుంబ నియంత్రణ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ నిర్మల గ్లోరీ ఆకస్మికంగా సందర్శించారు. ఆరోగ్య కేంద్రంలోని వసతులను డెలివరీ చేసే విధానాన్ని, పరికరాలను పరిశీలించారు. ఓ.పి, ఇమ్యునైజేషన్ తజర అంశాలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అనుసరించాల్సిన పాటించవలసిన పద్ధతులపై దిశా నిర్దేశం చేశారు. ఆర్‌బిఎస్‌కే స్కీం పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి మరియు ఇబ్రహీంపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ పర్వీన్, సిబ్బంది పాల్గొన్నారు.



వికలాంగ విద్యార్థులకు అన్న వితరణ

ప్రజాశక్తి-మైలవరం: లయన్ మద్దినేని శ్రీనివాసరావు కుమార్తె నాగలక్ష్మి మోహిత జన్మదిన సందర్భంగా స్థానిక భవ్య సెంటర్లోని వికలాంగ విద్యార్థులకు గురువారం అన్న వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైఫ్ ల్యాబ్ ఆఫ్ మైలవరం అధ్యక్షులు టి శ్రీధర్, సెక్రటరీ సిహెచ్ నాగభూషణం, ట్రెజరర్ కే ప్రసాద్, జోన్ చైర్మన్ లయన్ జాస్తి వెంకటేశ్వరరావు, క్లబ్ నెంబర్లు ఏడుకొండలు, రంగారావు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

క్రికెటర్ యశ్వంత్‌కు సన్మానం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: దసరా నుంచి సంక్రాంతి పండుగ మధ్య రాష్ట్రంలోని ప్రతి పాఠశాలలో క్రికెట్ టోర్నమెంట్స్ నిర్వహించబోతున్నట్లు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ చెప్పారు. ఇటీవల బధిర ఇంటర్నేషనల్ క్రికెట్ మ్యాచ్ లో మోకాలకి గాయమైన (డెఫ్ అండ్ డమ్) రావూరి యశ్వంత్‌కి డాక్టర్ భార్గవ్ రామ్ అత్యాధునిక వైద్యంతో ఆపరేషన్ విజయవంతం చేశారు. ఆపరేషన్ జరిగిన నాలుగు నెలల్లో రావూరి యశ్వంత్ 140 కిలోమీటర్ల వేగంతో బౌలింగ్ చేసి శ్రీనగర్ లో జరిగిన మ్యాచ్ లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గెలుచుకున్నాడు. ఈ సందర్భంగా బధిర క్రికెటర్ రావూరి యశ్వంత్‌కి డాక్టర్ భార్గవ్ రామ్, డాక్టర్ యు.వి.రమణ ది ట్రస్ట్ జాయింట్ సెంటర్ హాస్పటల్ లో గురువారం సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. యశ్వంత్ కి ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఎంపి మాట్లాడుతూ గాయపడిన రావూరి యశ్వంత్‌కి విజయవంతంగా ఆపరేషన్ చేయటమే కాకుండా మానసిక సైర్యం కోల్పోకుండా తిరిగి త్వరగా కోలుకునేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్న డాక్టర్ భార్గవ్ రామ్‌కి అభినందనలు తెలిపారు. బధిర క్రికెటర్ యశ్వంత్ కఠోరదీక్ష, పట్టుదలను కొనియాడారు. డెఫ్ అండ్ డమ్ క్రీడాకారులను ఆదుకునే విషయంపై ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వారికి ఉపయోగ పడే విధంగా విధివిధానాలు తయారు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, హాస్పటల్ సిబ్బంది, ఇతర నాయకులు పాల్గొన్నారు.



రూ.11 లక్షలతో రోడ్ల నిర్మాణం : లావణ్య

ప్రజాశక్తి-వన్‌టౌన్

స్థానిక న్యూభగత్‌సింగ్‌నగర్‌లో రూ.11 లక్షలతో రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణం చేపట్టినట్లు 45వ డివిజన్ కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య చెప్పారు. గురువారం న్యూ భగత్‌సింగ్‌నగర్‌లో రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మైలవరపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-వన్‌టౌన్: బీసీల పక్షపాతి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అని, అందుకే దేవాలయాల్లో పనిచేసే క్షురకులకు 25వేల రూపాయల కనీస వేతనాన్ని చంద్రబాబు ప్రకటించారని టిడిపి 48వ డివిజన్ అధ్యక్షులు పేరాబత్తుల రమణ కొనియాడారు. గురువారం దుర్గగుడి వద్ద చంద్రబాబు చిత్రపటానికి ఎన్టీఆర్ జిల్లా బార్బర్స్ అండ్ భజంత్రీ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ ఉప్పాడి రాము ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మైలవరపు వీరబాబు, సగురుపిళ్ల రమేష్, ఉప్పాడి రాము, యలమందారావు, కె.వి.రామారావు, నాగరాజు, అప్పారావు, హేమంత్ కుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కూరగాయల మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలో మినీ బైపాస్ బుద్ధుడి విగ్రహం వద్ద శాకాంబరి నూతన కూరగాయల మార్కెట్‌ను గురువారం మాజీ ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, కేడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ సామాన్యుడికి సరసమైన ధరలకు నాణ్యమైన అన్ని రకాల కూరగాయలు ఈ మార్కెట్లో అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వార్డ్ కౌన్సిలర్స్, తిరుమల శెట్టి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



గంపలగూడెంలో...



రక్త నమూనాల సేకరణ

ప్రజాశక్తి-గంపలగూడెం

కిడ్నీ వ్యాధి అనుమానితుల నుండి రక్త నమూనాలు సేకరించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన ఆదేశించిన నేపథ్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ఈ మేరకు సి హెచ్ఓ నరసాయమ్మ పర్యవేక్షణలో కనకయ్య తదితరులు రక్తనామూనాలు సేకరించారు. మండలంలోని అనుములంక గ్రామంలో పర్యటించి దాదాపు 86 మందికి ఈ శాంపిల్స్ తీసినట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

తిరువూరు: తిరువూరు మండలంలోని చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలలో సమగ్ర కిడ్నీ రోగుల గుర్తింపు సర్వే నిర్వహించినట్లు డాక్టర్ ఎ.కనక దుర్గ భవాని తెలి పారు. చౌటపల్లి, టేకులపల్లి, కాకర్ల, రామన్నపాలెం గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికెళ్లి కిడ్నీ బాధితులను గుర్తించి రక్త నమూనాలు సేకరించామని చెప్పారు. అన్ని గ్రామాల్లో సెప్టెంబర్ ఐదో తేదీ లోపల సర్వే పూర్తి చేస్తామని ఆమె తెలిపారు.

ఆట వస్తువులకు రూ.10 వేలు వితరణ


ప్రజాశక్తి-గంపలగూడెం: విద్యార్థులకు పాటలతోనే ఆరోగ్యం వస్తుందని భావించి, పది వేలు వితరణ చేసిన దాతకు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొల్లెపోగు కిరణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. గురువారం పాఠశాలలో పనిచేస్తున్న భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు చిమట సురేష్ విద్యార్థుల సౌకర్యార్థం ఆట వస్తువులు కొనుగోలు చేసుకునేందుకు చెక్కును హెచ్‌ఎంతో పాటు పిడి బంకా రాంబాబు సమక్షంలో రూ.10 వేలు అందజేశారు. ఈ సందర్భంలో ఉపాధ్యాయులు బూరుగు జమలయ్య, గోదా వెంకటరామయ్య, మాదర బోయిన కొండలు తదితరులు ఉన్నారు.

సోనుకు టైమ్స్ బిజినెస్ అవార్డు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ప్రముఖ మీడియా సంస్థ టైమ్స్ ఆఫ్ ఇండియా సంస్థ గత ఆరు సంవత్సరాలుగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వివిధ రంగాల సంస్థలకు అందిస్తున్న టైమ్స్ బిజినెస్ అవార్డ్ 2024 సంవత్సరానికి ఫొటోగ్రఫీ బిజినెస్ విభాగంలో ఇబ్రహీంపట్నానికి చెందిన స్నాప్లిక ఫొటోగ్రఫీ అధినేత సోను కు ప్రతిష్టాత్మక టైమ్స్ బిజినెస్ అవార్డు లభించింది. విజయవాడ నోవాటెల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ సినీ నటి రకుల్ ప్రీత్ సింగ్ చేతుల మీదుగా సోను అవార్డును అందుకున్నారు. గతంలో కూడా ఈయన పలు అవార్డులు అందుకున్నారు. ఫొటోగ్రఫీ రంగంలో నూతన ప్రమాణాలతో, అత్యుత్తమ ప్రతిభతో స్నాప్లిక ఫొటోగ్రఫీ దూసుకెళ్తోంది. కార్యక్రమంలో టీడీపీ ఎంపీ టి.జి.భారత్, టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు స్థానిక ప్రముఖులు సోను కు అభినందనలు తెలిపారు.

నందమూరి హరికృష్ణ వర్ధంతి

ప్రజాశక్తి-రెడ్డిగూడెం: టిడిపి కార్యాలయంలో నందమూరి హరికృష్ణ వర్ధంతిని నిర్వహించారు. టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులుగా, రాజ్యసభ సభ్యులుగా ప్రజలకు, పార్టీకి హరికష్ణ అందించిన సేవలు చిరస్మరణీయమని టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి అన్నారు. తెలుగు వాడి కీర్తిని చాటి చెప్పడంలో చైతన్యరథ సారధిగా నిలిచారన్నారు. సినీ నటుడిగా, రాజకీయ నాయకుడిగా తెలుగు ప్రజల హదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.



మూడో రోజుకు ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: వాణిజ్య పన్నుల శాఖలోని సర్కిల్ వ్యవస్థను నిర్వీర్యం చేశారని విజువల్ చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జి రవీంద్రబాబు ఆవేదన వ్యక్తంచేశారు. ఏపీ సిటీ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాణిజ్య పన్నుల శాఖ డివిజన్ 1 కార్యాలయం ముందు గురువారం భోజన విరామం సమయంలో ఉద్యోగులు పెద్ద ఎత్తున మూడవ రోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నిరసనలో ఉద్యోగులు ప్లకార్డులు ప్రదర్శించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ కేంద్రీకరణ నిర్ణయాలతో ఉద్యోగులు భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ సర్కిల్స్‌లో పని చేస్తున్న 96మంది ఉద్యోగులను ప్రధాన కార్యాలయంలో ఎటువంటి పని కల్పించకుండా జీతాలు ఇచ్చారని తెలిపారు. ఈ ఉద్యోగులను ఆయా సర్కిల్స్ కు సర్దుబాటు చేయాలని కోరారు. జీఎస్టీవోలకు రిజిస్ట్రేషన్ అధికారాలు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేపడుతున్న ఆయా శాఖలు సమీక్షలలో భాగంగా వాణిజ్య పన్నుల శాఖను కూడా సమీక్షించాలని కోరారు. కేంద్రీకరణ విధానానికి స్వస్తి పలికి వికేంద్రీకరణ చేపట్టాలని తెలిపారు. 1డివిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు టి భాస్కరరావు మాట్లాడుతూ పూర్వపు జరిగిన బదిలీలపై సమీక్షించాలని కోరారు. ఆర్వో వ్యవస్థలను రద్దు చేసి సర్కిల్ వ్యవస్థను తీసుకురావాలని అన్నారు. సమస్యలను సానుకూలంగా పరిష్కరించి ఉద్యోగులు బదిలీలు చేపట్టాలని కోరారు. ఏపీ సబార్డినేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బాపట్ల గోపాలకష్ణయ్య మాట్లాడుతూ సర్కిల్స్‌లో సమాంతర సర్దుబాటు చేయకుండా ఇష్టానుసారం చేశారని తెలిపారు. చిరు ఉద్యోగులకు కూడా అనుకూలమైన పరిస్థితులు ప్రభుత్వం కల్పించాలని కోరారు.

చిరస్మరణీయుడు గిడుగు రామ్మూర్తి

• పలుచోట్ల ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



కలెక్టరేట్ మందిరంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : తెలుగు వ్యవహారిక భాషకు విశేష ప్రాచుర్యం కల్పించిన మహనీయులు గిడుగు వెంకట రామమూర్తి పంతులని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కొనియాడారు. గురువారం నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశం మందిరంలో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, సంయుక్త కలెక్టర్ గీతాంజలి శర్మతో కలసి కలెక్టరేట్ ప్రాంగణంలోని తెలుగు తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి తెలుగు తల్లిని స్మరించు కుంటూ గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలుగు వ్యవహారిక భాషకు విశేష ప్రజాదరణ కల్పించుట కోసం ఉద్యమించిన పితా మహులు గిడుగు రామ్మూర్తి పంతులు చిరస్మర ణీయు లన్నారు. తదనంతరం తెలుగు కవులు, రచయితలను కలెక్టర్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక అధికారి రామ్ లక్ష్మణ్ సమాచార పౌర సంబంధాల శాఖ ఉపసంచాలకులు వెంకటేశ్వర ప్రసాద్, పలువురు కవులు, రచయితలు, భాషాభిమానులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** తెలుగు భాష దినోత్సవం సందర్భంగా సిఐటియు ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. గుడ్లవల్లేరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సిఐటియు మండల అధ్యక్షులు మేకల జయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి గ్రామ కార్యదర్శి ఏజేఎల్ నరసింహారావు, సిఐటియు ఉపాధ్యక్షురాలు ఎం చందన లక్ష్మి పూలమాలవేసి నివాళులర్పించారు. అలాగే పోస్ట్ ఆఫీస్ వద్ద పోస్ట్ మాస్టర్ భీమేశ్వరరావు పూలమాలవేసి నివాళు లర్పించగా పోస్టల్ సిబ్బంది, వి.విజయరావు, పాల్గొన్నారు. అలాగే కవుతరం, డోకిపర్రు అంగన్వాడి సెక్టార్ల వద్ద అంగన్వాడి కార్యకర్తలతో తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల బాధ్యులు బివి శ్రీనివాసరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు :** గ్రాంధిక భాషలో ఉన్న తెలుగు పవచనాన్ని ప్రజల వాడుక భాషలోకి తీసుకువచ్చి వ్యవహారిక భాషలో ఉన్న అందాన్ని తెలియజెప్పిన మహనీ యుడు గిడుగు వెంకటరామ మూర్తి అని ఏజీఅంర్ ఎస్ఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. శివనాథ్ అన్నారు. గిడుగు వెంకటరామమూర్తి 161వ జయంతి పురస్కరించుకుని కళాశాల తెలుగు శాఖ అధ్వర్యంలో గురువారం తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగు శాఖాధిప తి ఎంఎల్ఎస్ కుమారి, అధ్యాపకులు పాల్గొని గిడుగు గొప్పదనాన్ని తెలియజేశారు. **ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ :** మచిలీ పట్నంలోని స్తానిక నోబుల్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పాల్ డా.ఎస్ జె ఎర్నెస్ట్ అధ్యక్షతన వహించి విద్యార్థులకు తెలుగుభాష ప్రాము ఖ్యాన్ని తెలియజేశారు. తెలుగు విభాగాది పతి ఎల్ నాగవాణి, హిందీ విభాగాధిపతి డా.శాంతి, కంప్యూటర్ విభాగాదిపతి శివాజి, కామర్స్ విభాగాధిపతి అయిన గోపికష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ :** తెలుగును బతికించడానికి ప్రజా ఉద్యమం అవసరమని తెలుగు విశ్రాంత ఆచార్య అధిపతి ముఖ్య అతిథి కోగంటి గాంధీ బాబు అన్నారు. తెలుగు భాష దినోత్సవం వీరపనేని మురళీధరరావు మీటింగ్ హాల్ నందు సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో గురువారం జరిగింది. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి చార్లీ చాప్లిన్ క్లబ్ అధ్యక్షులు నరహరి శెట్టి ప్రసాద్ పూలమాల వేశారు. సాహితీ స్రవంతి అధ్యక్షులు ఎల్.సురేంద్ర, సాహితీ స్రవంతి కార్యదర్శి మాల్యాద్రి, తెలుగు ఉపాధ్యాయులు శ్రీకుమార్ మాధవరావు, సాహితీ స్రవంతి ఉపాధ్యక్షులు వై.కోటేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** వ్యవహారిక భాషోధ్యమ వీరుడు గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముస్తాబాదలో సభ జరిగింది. ప్రధానోపాధ్యాయులు సక్కుర్తి శ్రీనివాస రావు అధ్యక్షత వహించారు. పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గుర్రం రాజబాబు అంతర్జాతీయ జానపద గాయకులు దామోదర గణపతి రావు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ వ్యాయామోపాధ్యులు ఎమ్. లక్ష్మణ రావు, పాఠశాల ఉపాధ్యాయ కార్యదర్శి యన్. మణిరాజు తదితర ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి మోపిదేవి :** మండలంలోని కోసూరువారిపాలెం గ్రామంలో గల మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తుంగల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థులకు తెలుగు భాషా దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. అలాగే జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకొని క్రీడల ప్రాముఖ్యతను ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ విద్యార్థులకు వివరించారు. విద్యతో పాటు క్రీడలలోనూ విద్యార్థులు ముందంజలో నిలవాలన్నారు. **ప్రజాశక్తి-ఘంటసాల :** ఘంటసాల మండలం శ్రీకాకుళం శాఖ గ్రంధాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అధికారిణి దారా సుజాత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం టి.నాగబాబు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన వేడుకల్లో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఎస్.జగన్మోహనరావు అధ్యక్షత వహించి మాట్లాడారు. తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్. జి బి ఆనందకుమార్, ప్రముఖ సాహితీ విమర్శకులు బొడ్డపట్ల చంద్రశేఖర్, బంటుమిల్లి మండల విద్యాశాఖ అధికారిణి బి. త్రిపుర సుందరి, హిమాలినీ దేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన కవితల పోటీ, వ్యాసరచన, సాహితీ క్విజ్ పోటీలు నిర్వహించారు. అలాగే బంటుమిల్లి సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు వేషధారణలు, శతక పద్యాలు, పాటలు ఉపన్యాసాలతో ప్రతిభను చాటారు. అలాగే మేజర్ ధ్యాన్ చంద్ జయంతి స్పూర్తి స్పోర్ట్స్ డే ను కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాబుజాన్ ఝాన్సీ సబ్, తెలుగు ఉపాధ్యాయులు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలుగు తల్లి విగ్రహానికి గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షులు దిరిశం వెంకట్రావు, కొక్కిలిగడ్డ సర్పంచ్ జానకి, రాంబాబు, టిడిపి జనసేన నాయకులు బండ్రెడ్డి హరి పాల్గొన్నారు.



గుడ్లవల్లేరులో...



బంటుమిల్లిలోని సెయింట్ జాన్స్ పాఠశాలలో...



బందరులోని నోబెల్ కళాశాలలో...

కేంద్ర ప్రభుత్వ విధానాలపై నిరసన

ప్రజాశక్తి కలక్టరేట్ (కష్ణా) : ఎల్ఐసి సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు గురువారం దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలకు, ముఖ్యంగా జీవిత భీమా పాలసీ విధివిధానాలకు వ్యతిరేకంగా స్థానిక జీవిత బీమా కార్యాలయాల ముందు నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కె. రాజారావు, కె ఆర్ కె. గుప్తా , జేమ్స్, మోర్ల పాండు రంగారావు, మురహరి రెడ్డి, భాస్కరరావు, పిచ్చేశ్వరరావు, మౌలాలి, శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్ణే శ్వరరావు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

క్రీడాకారులకు కిట్లు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు ప్రతిఒక్కరు ముందుకు రావాలని కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఛైర్మన్ కేవీ. రమణ, కార్యదరి కేవీఆర్. కిషోర్ అన్నారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ క్లబ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు గురువారం కేవీఆర్ స్పోర్ట్సఅండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా టీషర్టు, స్పోర్ట్స్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా రమణ, కిషోర్ మాట్లాడుతూ గన్నవరం ప్రాంతం క్రీడలకు పుట్టినిల్లు అన్నారు. ఈ ప్రాంతానికి చెందిన ఎంతో మంది క్రీడాకా రులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు సాధించారని తెలిపారు. వీరి స్పూర్తితో గ్రామీణ క్రీడలను, క్రీడాకా రులను ప్రోత్సాహిం చడమే లక్ష్యంగా తమ అసోసియేషన్ పని చేస్తుందన్నారు. దీనిలో భాగంగా ప్రతిభ వంతులైన క్రీడాకారులను గుర్తించి తగిన శిక్షణ. సహకారం అందిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ క్లబ్ ను ఏర్పాటు చేసి ఉత్తమ క్రీడాకారులుగా యువతను తీర్చిదిద్దుతున్న నిర్వాహకులను అభినం దించారు. వాలీబాల్ క్లబ్కు చెందిన రామారావు. చిన్నారావు, గ్రామస్తులు నల్లమోతు రమేష్, గరిమెళ్ళ హరిబాబు, మూల్పూరు శివరామ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.



టీషర్టు, స్పోర్ట్స్ కిట్ అందజేసిన దృశ్యం

రేపు మినీ జాబ్‌మేళా

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఈ నెల 31 వ తేదీన అనగా శనివారం ఉదయం పది గంటలకు ఎంప్లాయిమెంట్ ఆఫీస్‌లో మినీజాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్ బాబు ఒక ప్రకటన లో తెలియజేశారు. ఈ జాబ్ మేళాను ఉమ్మడి కృష్ణ జిల్లా, ఎన్టీఆర్ జిల్లా నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగ పరుచు కోవాలని ఆయన కోరారు. ఈ మిని జాబ్ మేళాలో కార్యక్రమంలో వరుణ్ మోటార్స్ ఇంట ర్వ్యూలు నిర్వహిస్తున్నట్టుగా తెలిపారు. సేల్స్ ఎక్సెట్యూటివ్,సర్వీస్ అడ్వైజర్స్, టెక్నీషియన్స్, డెన్టర్స్, పెయింటింగ్స్ , అకౌంటెంట్స్ (పురుషులకు మాత్రమే) ఉద్యోగాలు ఉన్నాయన్నారు. జిల్లాలోని పదవ తరగతి ఐటిఐ డిప్లమా, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 సంవత్సరాల నుండి 30 సంవత్సరాల లోపు నిరుద్యోగుల పూర్తి బయోడేటా ధవ పత్రాలు జిరాక్స్ కాపీలు ఆధార్ కార్డుతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు ఆసక్తి గల అభ్యర్థులు www.ncs.gov.in వెబ్ సైట్లో వివరాలు నమోదు చేసుకో వాలన్నారు. ఇతర వివరాలకు 9985444333 ను సంప్రదిం చవచ్చని తెలిపారు.

సైక్లింగ్ పోటీల్లో ప్రతిభ

ప్రజాశక్తి-చల్లపల్లి : విశ్రాంత రెవెన్యూ ఇన్స్పెక్టర్, లలితా దేవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముమ్మారెడ్డి కష్ణారావు మనుమరాలు చర్విత ఈనెల 25వ తేదీన సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్లో జరిగిన సైక్లింగ్ పోటీలలో తృతీయ స్థానంలో నిలిచి బహుమతి అందుకుంది. డాక్టర్ మాక్సవెల్ ట్రీవోర్ సైక్లింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-8 బాలికల విభాగంలో కిడ్స్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ చాంపియన్షిప్ సీజన్-4 క్రింద ఈ సైక్లింగ్ పోటీలు నిర్వహించారు. మొత్తం తొమ్మిది మంది బాలికలు పాల్గొనగా అందులో ముమ్మారెడ్డి చర్విత మూడవ విజేతగా నిలిచి ఐఏఎస్ అధికారిని సోనియా నాగ్పాల్ చేతుల మీదుగా పతకాన్ని, ప్రశంస పత్రాన్ని అందుకుంది. కేవలం సైక్లింగ్ ఈవెంట్ మాత్రమే ప్రతిభను కనపరచడమే కాక భగవద్గీత పారాయణం, చిత్రలేఖనం వంటి అంశాల్లో కూడా ప్రతిభ చూపిన చర్వితను పలువురు అభినందిస్తున్నారు.



పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న బండి రామకృష్ణ

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవ వారోత్సవాల్లో భాగంగా మచిలీపట్నంలోని జెట్టి నరసింహ స్వామి వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఈవన నరసింహస్వామి, ఆర్కే యూత్ ఆధ్వర్యంలో పండ్లు రొట్టెలు, బిస్కెట్లు,పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండి రామకృష్ణ మాట్లాడుతూ పవన్‌కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఐదు రోజులు సేవా కార్యక్రమాలు చేపట్టామని, దీనిలో భాగంగా గురువారం వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పండ్లు, రొట్టెలు బిస్కెట్లు పంపిణీ చేశామన్నారు. జనసేన పార్టీ నాయకులు బండి విజయ్, గడ్డం రాజు, కొట్టే వెంకట్రావు, చౌదరి, షాహిన, ఫణి పాల్గొన్నారు.

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి మండలం పెదప్రోలులో గురువారం శ్రీ రామ షిర్డీ సాయి మందిరం 17వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొనకళ్ళ జగన్నాధరావు (బుల్లయ్య), అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తనయులు మండలి వెంకట్రామ్ అతిధు లుగా విచ్చేసి బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. దేవస్థానం చైర్మన్ నంబూరి ఆంజనేయులు అతిథులకు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని కొనకళ్ళ బుల్ల య్య, మండలి వెంకట్రామ్ ప్రారంభించారు. టీడీపీ మోపి దేవి మండల అధ్యక్షులు నడకుదుటి జనార్ధన్, మాజీ సీడీసీ చైర్మన్ రావి నాగేశ్వరరావు, చల్లపల్లి వైస్ ఎంపీపీ రాంబాబు పాల్గొన్నారు.

తెలుగు భాషా పితామహుడు గిడుగు

వృద్ధుని నాలుక కేన్సర్‌కు అత్యాధునిక చికిత్స

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: తీవ్రస్థాయి నాలుక క్యాన్సర్‌తో బాధపడుతున్న 91 ఏళ్ల రోగికి కానూరులోని అమెరికన్ ఆంకాలజీ ఇన్‌స్టిట్యూట్ (ఏఓఐ)లో విజయవంతంగా చికిత్స చేశారు కానూరు


డాక్టర్ హరీష్

లోని అమెరికన్ ఆంకాలజీ హాస్పిటల్. నందు గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సిఇఓ హరీష్ త్రివేది మాట్లాడుతూ 91 సమత్సరల వ్యక్తి స్టేజ్-3 నాలుక క్యాన్సర్ పేషెంటుకు, డాక్టర్ సాయి స్నేహిత్ సంరక్షణలో రాడికల్ రేడియోథెరపీతో కూడిన కఠినమైన చికిత్స ప్రణాళికను అందించినట్లు తెలిపారు. ఈ చికిత్స విజయవాడ వంటి ప్రాంతాల్లో ప్రపంచ స్థాయి క్యాన్సర్ సంరక్షణకు ఉన్న అవకాశాల యొక్క ప్రాముఖ్యతను వివరిస్తుందని అన్నారు. ఈ విజయం దక్షిణాసియా అంతటా క్యాన్సర్ సంరక్షణను మార్చాలనే తమ అంకితభావాన్ని వెల్లడి చేస్తుందని పేర్కొన్నారు. తమ బందం అందించిన అసాధారణమైన చికిత్స పట్ల తాము ఎంతో గర్విస్తున్నామని విజయవాడ ఏఓఐ ఆర్సీవోవో మహేందర్ రెడ్డి అన్నారు. ఈ చికిత్సపై ఏఓఐ విజయవాడ రేడియేషన్ ఆంకాలజీ డాక్టర్ సాయి స్నేహిత్ మాట్లాడుతూ ఈ కేసు వ్యక్తిగతీకరించిన సంరక్షణ ప్రణాళికల ప్రాముఖ్యతను, సంక్లిష్ట క్యాన్సర్ కేసులను ఖచ్చితత్వంతో నిర్వహించగల తమ బందం యొక్క సామర్థ్యాన్ని వెల్లడి చేస్తుందని అన్నారు.

ఒప్పంద కార్మికులకు సెలవులు అమలు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ ఇబ్రహీంపట్నం ఒప్పంద ఔట్సోర్సింగ్ కార్మికులకు వారాంతపు సెలవులు ఇవ్వాలి, వారాంతపు రికవరీ ఆపాలి మరియు పండుగ సెలవులు అమలు చేయాలని



కోరుతూ డిప్యూటీ లేబర్ కమిషనర్ (జిల్లా) ఆశా రాణికి సిఐటియు బందం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో ఒప్పంద ఔట్ సోర్సింగ్ కార్మికులకు వారాంతపు సెలవులు అమలు చేసి వాటిని గత మూడు నెలల నుంచి గుత్తేదారు వసూలు చేస్తున్నారని, ఈ విధానాన్ని తక్షణమే ఆపాలని మరియు జాతీయ పండుగలకు సెలవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ యాజమాన్యం కార్మికులను గుత్తేదారు కట్టు బానిసలుగా మార్చి తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్నారన్నారు. కనీసం సెలవులు కూడా అమలు చేయకపోవడం కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. మహిళా కార్మికులకు పని ప్రదేశాల్లో భద్రత, భోజనం సమయంలో విశ్రాంతి గదులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి ఎం మహేష్, జిల్లా నాయకులు ఎం సోమేశ్వరరావు వై సుబ్బారావు, ఆర్టీసీ కార్మికులు కిరణ్ ,భూషణం, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికునిపై దాడికి నిరసన

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపల్ వాటర్ ట్యాంక్ డ్రైవర్ కాళీ దాస్‌పై డ్యూటీ టైంలో బయటి వ్యక్తులు దాడిని ఖండిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి యం మహేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుడి పై విధుల్లో ఉండగా దాడి జరిగితే మున్సిపల్ అధికారులు తక్షణమే స్పందించకపోవడం విచారకరమన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి దాడి చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వెంటనే నిందితులను శిక్షించాలి అని డిమాండ్ చేశారు.

బంగారం, నగదు చోరీ

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ చెరువు బజార్లో గోపు సుధాకర్ ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. గోపు సుధాకర్ కుటుంబ సభ్యులు వారి తమ్ముడు ఇంటికి వెళ్లారు .ఇంట్లో ఎవరూ లేకపోవడంతో తాళాలు పగల కొట్టి బంగారం 25వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లారు. గురువారం నాడు యజమానులు ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి ఉండటంతో పోలీసులు సమాచారం ఇచ్చారు.సంఘటన స్థలానికి సిఐ వైవిల్ నాయుడు , ఎస్ఐ శాతకర్ణి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు .సాధ్యమైనంత తొందరగా దొంగను పట్టుకొని బంగారం డబ్బులు రికవరీ చేస్తామని సీఐ తెలిపారు.

జయంతి కార్యక్రమాల్లో వక్తలు

ప్రజాశక్తి-విజయవాడ: మాతృభాష దినోత్సవం, తెలుగు భాష వైతాళికుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు 161వ జయంతి వేడుకలు విజయవాడ బాలోత్సవ భవనంలో గురువారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ఎంబివికె ట్రస్ట్ చైర్మన్ పి మధు అధ్యక్షత వహించగా భాషోపన్యాసకులు వలివేటి వెంకట శివరామకృష్ణమూర్తి మాట్లాడుతూ గిడుగు అనుసరించిన బాటలో ప్రతి ఒక్కరూ పయనిస్తూ ప్రతి క్షణం తెలుగు ఔన్నత్యం కోసం పాటుపడాలని కోరారు. ఇంగ్లీషు, ఇతర భాషలు నేర్చుకుంటున్నప్పటికీ... తెలుగు భాష సజీవంగా నిలబడాలన్నా... వికసించడానికి ప్రతి ఇంట్లో పిల్లల చేత కుటుంబ సంబంధ బాంధవ్యాలను, తినే పదార్దాలను తెలుగు పదాలతోనే తల్లిదండ్రులు ప్రాధమికంగా నేర్పించాలని, అప్పుడే పిల్లవాడి మనుగడకు, జీవితానికి ఉపయోగపడుతుందని అన్నారు.. నేటికీ తెలుగు భాష బతికిందనడానికి ప్రభుత్వాల ఉత్తరప్రత్యుత్తరాలు తెలుగులో జరుగుతున్నందునేనని అన్నారు. ఎంబివికె ట్రస్ట్ చైర్మన్ మధు మాట్లాడుతూ భాషాభివృద్ధి కోసమే కాక, ఆనాడు సమాజంలో వెనుకబడిన సవరల (గిరిజనుల) భాషకు ఒక లిపిని కనిపెట్టి, దాని అభివృద్ధి కోసం రామమూర్తి పంతులు కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబివికె కార్యదర్శి పి.మురళీకృష్ణ, బాధ్యులు టి.క్రాంతికిరణ్, కె స్వరూపరాణి, గాయత్రి తదితరులు పాల్గొన్నారు. పిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్, అనిఫ్ తెలుగు ఔన్నత్యం, దాని విశిష్టతపై గేయాలాలపించారు. ముందుగా గిడుగు రామమూర్తి పంతులు చిత్రపటానికి శివరామకృష్ణమూర్తి, మధు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

బెజవాడ బార్ అసోసియేషన్ అధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె చంద్రమౌళి, ఎ శివరాంప్రసాద్ రాజా మాట్లాడుతూ...సామాన్యులకు అర్ధమయ్యే (వ్యావహారికి భాష) భాషను ఉపయోగించే విధానం కోసం గిడుగు రామమూర్తి పంతులు విశేషంగా కృషి చేశారని అన్నారు. ముందుగా తెలుగు తల్లి చిత్రపటానికి న్యాయవాదులు పూలమాలవేసి నివాళులర్పించారు. **వన్‌టౌన్:** మాతృభాషతోనే విజ్ఞాన శాస్త్రాల వికాసం సాధ్యమని ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల తెలుగు విభాగం, తెలుగు సంపద సంయుక్త ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశభక్తి పెంపొందటమే కాకుండా మానవ మనుగడకు మాతభాష గొప్ప సాధనమని వివరించారు. ఈ కార్యక్రమంలో సాహితీవేత్త డాక్టర్ వాడ్రేవు సుందరరావు, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, తూనికుంట్ల శ్రీనివాసు, తెలుగు సంపద సంస్థ ప్రధాన సలహాదారు డాక్టర్ మూర్తి రేమిళ్ళ, లిపి గేమ్ ఇండియా ఉపాధ్యక్షురాలు అపర్ణ, హిందూహైస్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ నారాయణరావు, కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ పీఎల్ రమేష్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే రామకష్ణ తదితరులు ప్రసంగించారు. **భవానీపురం:** తెలుగు భాషకు గుర్తింపు తెచ్చిన గిడుగు రామ్మూర్తి కృషి ఎనలేనిదని ఇస్రో సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ మూర్తి రేమెళ్ల అన్నారు. విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం, జాతీయ అంతర అంతరిక్ష వారోత్సవాల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు భాషకు వ్యవహారిక భాష ద్వారా గుర్తింపు తెచ్చిన గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆటల వల్ల ఆరోగ్యమే కాకుండా మానసిక ఆరోగ్యం కూడా బాగుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల


మాట్లాడుతున్న భాషోపన్యాసకులు శివరామకృష్ణమూర్తి

ప్రధానోపాధ్యాయులు మాతంగి కోటయ్య, ప్రసాద్, డివి మురళి ప్రసాద్, శివ పార్వతి, జ్యోతిర్మయి, అనసూయ, ఉదయ్ కిరణ్, వ్యాయామ ఉపాధ్యాయిని విజయలక్ష్మి పాల్గొన్నారు. అంతరిక్ష వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ విజేతలైన విద్యార్థులకు డాక్టర్ మూర్తి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. **వత్సవాయి:** తెలుగు భాషా దినోత్సవ వేడుకలు మక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో వత్సవాయి జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయుడు అద్దంకి సుధాకర్, హెచ్ఎం చిత్రాల వెంకటేశ్వరావు, డి శ్రీనివాసరావు, టిడిపి ప్రసాద్, అజ్మీర్ శ్రీనివాసరావు, దుర్గారావు పాల్గొన్నారు. కంభంపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు ఇందిర అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదారపు వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ శ్రీనివాసరావు పాల్గొన్నారు. **జగ్గయ్యపేట:** తెలుగు భాషా, జాతీయ క్రీడ దినోత్సవం సందర్భంగా మండలంలోని చిల్లకల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ యాజమాన్యం ఏర్పాటు చేసినకార్యక్రమంలో ముఖ్య అతిథిగా శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పాల్గొన్నారు. ముందుగా తెలుగు అధ్యాపకులను, ఫిజికల్ డైరెక్టర్‌లను శాలువాతో సత్కరించారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. గండ్రాయి మెయిన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్‌బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుబ్బారావు, జ్యోతి కుమారి, రమాదేవి, దేవదానం, పద్మావతమ్మ, ముక్తేశ్వర రావు, ఆయా వెంకట్రావమ్మ పాల్గొన్నారు. మండలంలోని ధర్మవరప్పాడు తండా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని కసుకుర్తి మంగతాయమ్మ, పర్చా లక్ష్మణరావు, టివి సుజాత, ఆరోగ్య మేరి, పల్లవి పాల్గొన్నారు. రసమయి సాహితీ సమితి ఆధ్వర్యంలో పట్టణ ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రసమయి సాహితీ సమితి రాష్ట్ర అధ్యక్షులు దోసపాటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక శాసనసభ్యులు శ్రీరామ్ రాజగోపాల్ పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, శతక పద్యాలు పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో 9వ వార్డు కౌన్సిలర్ పేరం సైదేశ్వరరావు, గ్రంథాలయ అధికారిని ప్రభ, శ్యామల, రమేష్ సత్యవతి, రాము పాల్గొన్నారు. **కంచికచర్ల:** కంచికచర్ల శాఖా గ్రంథాలయంలో గిడుగు రామమూర్తి చిత్రపటానికి గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు మాస్టర్ యెస్.కె ఇస్మాయిల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్ట్ ఫణికుమార్, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు. **మైలవరం:** స్థానిక లీలావతి గిరిజన పాఠశాలలో గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకొని పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ తెలుగు భాష గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు తెలుగువారి వివిధ రకాల వేషధారణలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాధాకుమారి పాల్గొన్నారు. **తిరువూరు:** తెలుగు భాషా దినోత్సవ వేడుకలు సుందరయ్య విజ్ఞాన కేంద్రం అధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా తిరువూరు పట్టణ స్థాయిలో తెలుగు భాష ఔన్నత్యంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో 310 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం తెలుగు భాషా సమితి అధ్యక్షులు తోట ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు అధ్యాపకులు విజయానందరాజు తెలుగు భాష గొప్పతనం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సుందయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కె.పాపారావు, ప్రముఖ కవికుమార్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్ రిటైర్డ్ మేనేజర్ పసుమర్తి వెంకటేశ్వరావు, విజ్ఞాన కేంద్రం బాధ్యులు పాకాల రామకృష్ణ, ధనసుందరరావు, సురేంద్రనాథ్, బి.వెంకటేశ్వరరావు, మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు. నాగార్జున, శ్రీనిధి, సిద్దార్థ, గీతమ్, విజ్ఞాన్ పాఠశాలలో, జిల్లా పరిష త్ బాలికోన్నత, మునకుళ్ల, గానుగపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లక్ష్మీపురం ప్రాథమికోన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. **ఇబ్రహీంపట్నం:** కొండపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు బి.పద్మలత, ఎఎంసి చైర్మన్ షేక్ బాజ్జి, వైస్ చైర్మన్ కె సురేష్‌బాబు పాల్గొన్నారు. **నందిగామ:** నందిగామ పట్టణంలోని కాకాని వెంకటరత్నం కళాశాల తెలుగు శాఖ ఆధ్వర్యంలో గురువారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ చాట్ల కిషోర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాయప్ప, ఆంగ్ల అధ్యాపకులు యు.వాసుదేవరావు, వాణిజ్యశాస్త్ర శాఖాధిపతి డాక్టర్ కోంద్రు రమేష్‌బాబు పాల్గొన్నారు. నందిగామ జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని పొదిలి విజయలక్ష్మి తెలుగు ఉపాధ్యాయులు వి.జానకి, ఐ.ఉమాకాంత్, వై.హనుమంతరావు, డి.శీనివాసరావు పాల్గొన్నారు.



రఘునందన్‌కు పురస్కారం

ప్రజాశక్తి-తిరువూరు: భారతదేశం నా మాతభూమి ప్రతిజ్ఞ రచయిత పైడిమ ర్రి వెంకట సుబ్బారావు జీవిత చరిత్రను తెలుగు, హిందీ భాషల్లో రచయిత సంకలనకర్త విశ్రాంత హిందీ ఉపా ధ్యాయుడు రేపాక రఘునందన్ కు గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్ జాతీయ సాహితీ పురస్కారం లభించింది. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా విజయవాడ ఠాగూర్ గ్రంథాలయంలో జరిగిన గిడుగు రామమూర్తి జయంతి కార్యక్రమంలో రఘునందన్ కు జాతీయ పురస్కారాన్ని అందజేశారు. ఫౌండేషన్ అధ్య క్షురాలు కాంతి కష్ణ, ఐఆర్ ఎస్ అధికారి జల్ది విద్యా ధర్, నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షుడు బిక్కి కష్ణ చేతుల మీదుగా రఘునందన్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. రఘునందన్ ను పలువురు కవులు, రచయితలు అభినందించారు.


వత్సవాయిలో...


వన్‌టౌన్‌లో...





ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు



అవనిగడ్డలో క్రీడాకారులను సత్కరిస్తున్న కలెక్టర్, ఎంఎల్ఎ

ప్రజాశక్తి-అవనిగడ్డ : దివిసీమ క్రీడా రంగానికి ఒలంపిక్స్ స్థాయి ఖ్యాతి ఉందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గురువారం అవనిగడ్డలో జాతీయ క్రీడా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా స్థాయి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, డీఈవో తెహరా సుల్తానా ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ జిల్లా పిడి అండ్ పిఈటి అసోసియేషన్ అవనిగడ్డ సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కలెక్టర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలదండలు వేసి నివాళు లర్పించారు. బందరు ఆర్డీఓ ఎం వాణి, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్ రామ్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే క్రీడా మైదానంలో భారీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఆటల క్రీడల పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. బహుమతులను శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు తోట శ్యామ్ కిషోర్ నాయుడు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. **ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్** : మచిలీపట్నంలోని పిఎమ్ శ్రీ కేంద్రీయ విద్యాలయంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు, ఉపాధ్యయులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. విద్యాలయ ప్రిన్సిపాల్ మహ్మద్ అసీఫ్, విద్యాలయ పిడిబిబివి ప్రసాద్, కోచ్ పోతురాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే కృష్ణా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయకుమారి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రీడలను అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు పరుచూరి గోపి ,డాక్టర్ సుజయ్, విద్యార్థినీ విద్యార్థులతో పాటు ఇతర ఉపాధ్యాయ బందం కూడా పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం** : హనుమాన్ జంక్షన్ శ్రీ చైతన్య పాఠశాలలో గురువారం క్రీడా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా స్రవంతి చారిటబుల్ ట్రస్ట్, సంస్థాపకులు వీరమాచనేని సత్యప్రసాద్ విచ్చేసి మాట్లాడారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. రాజేష్, ఏ. ఓ రమణ, డీన్ మౌలాలి పాల్గొన్నారు. అలాగే గన్నవరం మండలం సూరంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలో క్రీడా దినోత్సవం వేడుకలు నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యా యులు కోట హరిచరణ్ తెలిపారు. ముందుగా హరిచరణ్ వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ బాపట్ల శాంతి కిరణ్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ పి సుభాషిని తో కలిసి హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్చంద్, తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామమూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. **ప్రజాశక్తి - గుడివాడ** : హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ ప్రతిభతో తొలినాళ్లలో భారత క్రీడా రంగాన్ని అంతర్జాతీయ గుర్తింపు తీసుకువచ్చిన మహనీయుడని మాజీ మున్సిపల్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరరావు అన్నారు. ఎన్టిఆర్ స్టేడియం ప్రాంగణంలో గురువారం స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ స్టేడియం ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు లంకదాసరి ప్రసాదరావు, పర్వతనేని ఆనంద్, బొగ్గరపు తిరపతయ్య, మేనేజర్ ఎం.సత్యనారాయణ, క్రీడాకారులు, కోచ్లు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్ మాట్లాడారు. వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్.పద్మజ, కళాశాల పాలక వర్గ ప్రెసిడెంట్ యల్.ఆర్.కె ప్రసాద్, సెక్రటరీ, కరెస్పాండెంట్ కె.ఎస్. అప్పారావు, ఫిజికల్ డైరెక్టర్ వీర్ల గోపి, విద్యార్థులు అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : స్థానిక కళాశాలలో జాతీ య క్రీడాదినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్ పి.చంద్రబాబును ప్రిన్సిపాల్ శివ నాథ్, ప్రత్యేక అధికారి కె.సత్యనారాయణ, జూనియర్ కళాశాల డైరెక్టర్ వినయ్కుమార్ సత్కరించారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : స్థానిక వివి ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో గురువారం క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులందరికీ చేత వ్యాయామం ప్రతిరోజు చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఏ లక్ష్మణ్ రావు, కార్యక్రమ ప్రతినిధి వియల్ వినోద్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ ఎస్ కే అమీనాభి, డాక్టర్ పి.రవిషా పాల్గొన్నారు.



గుడివాడలో...

రోడ్డుకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలంలోని వెంట్రప్రగడ శివారు శివాపురం చెరువు వద్ద నుండి దళితవాడ వరకు ఎస్డిఎఫ్ నిధులు రూ30 లక్షలతో ఒక కిలోమీటర్ రోడ్డుకు గురువారం పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా శంకుస్థాపన చేశారు. అలాగే భూషణగూళ్ళ గ్రామంలో దొండపాటి రాంబాబు తనయుడు వివాహంలో దంపతులను ఆశీర్వదించారు.అలాగే వెంట్రప్రగడ ఎయిర్ ఫోర్స్ కమాండర్ కాట్రగడ్డ నాగేశ్వరరావు ఇటీవల మృతి చెందగా అతని సంతాప సభలో పాల్గొని నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం విజయబాబు, జుజ్జువరపు బాజి, కాగిత లక్ష్మీనారాయణ, రావూరి చిన్న కోటేశ్వరరావు, మెండం దాసు, పాతూరి బసవయ్య,కూచిపూడి సుబ్బయ్య, గొరిపర్తి రవికుమార్, చప్పిడి కిషోర్, చిలక ఆంజనేయులు, దగాని లెనిన్, తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ హత్య కేసు నిందితులను శిక్షించాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో 2020 నవంబర్లో హత్యకు గురైన ప్రముఖ వైద్యులు డాక్టర్ కోట శ్రీహరిరావు హత్యపై నిజాయితీగా విచారణ జరిపి దోషులను శిక్షించాలని మాజీ ఎమ్మెల్యే వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ సింహాద్రి రమేష్ బాబు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయం వద్ద ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనను మహా టీవీ వారు ప్రశ్నించిన అంశంపై స్పందించారు. హత్యకు గురై నాలుగేళ్లయిన పట్టించుకోని అప్పటి ప్రతిపక్ష నాయకుడు బుద్ధ ప్రసాద్ ఎన్నికల సందర్భంగా తప్పుడు ఆరోపణలతో అసత్యాలు ప్రచారం చేస్తూ తమపై నిందలు మోపి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారన్నారు. తిరిగి అధికారంలోకి వచ్చి సిఐడి ఎంక్వయిరీ అంటూ అసలు విషయాన్ని పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. డాక్టర్ హత్యకు ముందు ఆరు నెలల క్రితం ఓ గుర్తు తెలియని అగాంతకుడు ఆ ఇంటిలోకి ప్రవేశిస్తున్నట్లు సీసీ కెమెరాలు రికార్డు అయి ఉన్నప్పటికీ పోలీసులు పట్టించుకోలేదని, దానిని ఎందుకు పరిగణలోకి తీసుకోలేదో చెప్పాలన్నారు. పాల్గొన్న వైసీపీ నాయకులు కడవకొల్లు నరసింహారావు, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు

బస్సుల కొరతతో విద్యార్థుల అగచాట్లు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరులో బస్సుల కొరతతో విద్యార్థులు అగచాట్లు పడుతున్నారు. గుడ్లవల్లేరు గ్రామంలో అనేక విద్యాసంస్థలు ఉండటంతో దూర ప్రాంతాల నుండి విద్యార్థిని విద్యార్థులు డిప్లమో, ఇంజనీరింగ్, ఐటిఐ విద్యను అభ్యసించేందుకు నిత్యం బస్సుల ద్వారా ప్రయాణిస్తారు. అయితే ఒక సమయానికే అన్ని విద్యాసంస్థలు ముగియడంతో రెండు గంటల పాటు విద్యార్థిని విద్యార్థులు బస్టాండ్లో బస్సుల కోసం ఎదురుచూసే పరిస్థితి ఏర్పడుతోంది. గుడివాడ, జంక్షన్, నూజివీడు, విజయవాడ గ్రామాల నుండి విద్యార్థిని విద్యార్థులు వస్తారు. గతంలో గుడివాడ ఆర్టీసీ డిపో వారు ఉదయం సాయంత్రం స్టూడెంట్ బస్సును ప్రత్యేకంగా నడిపేవారు. ఈ ఏడాది ఆ బస్సులను ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అంతేగాక బస్సు ఎక్కేందుకు ఒక్కసారిగా అందరూ ప్రయత్నించగా ప్రమాదాలు జరిగే అవకాశం కూడా ఉంటుంది. కాబట్టి స్టూడెంట్ బస్సును తిరిగి ఏర్పాటు చేయాలని విద్యార్థిని విద్యార్థులు కోరుతున్నారు.

వేతనాలు రాక ఇబ్బందులు

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలలో నెలల తరబడి జీతాలు అందక పారిశుధ్య సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. వైద్యవిధాన పరిషత్ ఆధీనంలో ఉన్న ఈవైద్యశాలలో 8మందికి పైగా శానిటేషన్ సిబ్బంది, సూపర్వైజర్లు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తుండగా దాదాపు 5 నెలల నుంచి జీతాలు రాక వాటికోసం ఎదురుచూస్తున్నారు. చాలీచాలని జీతాలతో పనిచేస్తున్న మాకు నెలల తరబడి జీతాలు ఇవ్వక పోతే ఏమి తినాలని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. పనిచేసి జీతాల కోసం రోడ్డెక్కే పరిస్థితులు దాపురిస్తున్నాయని ఇప్పటికైన జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు. సంవత్సరాల తరబడి పీఎఫ్ కూడా కట్టడంలేదని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. శానిటేషన్ సిబ్బంది జీతాల పెండింగ్ సమస్యపై వైద్యశాల సూపరింటెండెంట్ మురళీని వివరణ కోరగా కాంట్రాక్టు సూపర్వైజర్కు పరిస్థితి తెలియజేశామని, త్వరలో జీతాలు చెల్లించేలా చూస్తామన్నారు.

కార్మికులు బీమా పాలసీలు తీసుకోవాలి : జడ్జి

ప్రజాశక్తి - గుడివాడ : కార్మికులుగా ఉన్న ప్రతిఒక్కరూ బీమా పాలసీలు తీసుకోవాలని న్యాయ విజ్ఞాన సదస్సు చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.సుబ్రహ్మణ్యం అన్నారు. గురువారం స్థానిక కోర్టు కార్యాలయంలో రాష్ట్ర న్యాయసేవాధికారి ఉత్తర్వుల మేరకు అసంఘటిత కార్మికులకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రమాద వశాత్తు ఏమైన ప్రమాదాలు జరిగినప్పుడు వారికి ఇన్సు రెన్సు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్మి కులకు పథకాలు, చట్టపరంగా ఉన్న సమస్యలు ఉంటే మండల న్యాయసేవాధికారి కమిటిని సంప్రదిం చాలని తెలిపారు. సిఐటియు పట్టణ కార్యదర్శి టి. లక్ష్మణరావు మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డును గత ప్రభుత్వం కార్మిక సంక్షేమ నిధి వాడుకోవడం వల్ల గుడివాడ పట్టణంలో భవన నిర్మాణ కార్మికులు పెట్టుకున్నటువంటి క్లైములకు సంబంధించిన అమౌంట్ సుమారుగా 90 లక్షల రూపాయలు వరకు రావలసి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారిని ఏఎల్వో విఎన్ బిందు, ది కృష్ణాజిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ రిజిస్ట్రేషన్ నెంబర్ జి 15 60 సిఐటియు అనుబంధం గుడివాడ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దూస్, నాయకులు బొబ్బర పల్లి ఆంజనేయులు, ఎస్ ఎం మొహిద్దీన్ భాష, ఎండి రషీద్ బేగ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు పట్టణ కార్యదర్శి టి. లక్ష్మణరావు

పోక్సో చట్టంపై ఉపాధ్యాయులకు అవగాహన



గుడ్లవల్లేరులో మాట్లాడుతున్న ఎంఇఒ జగన్మోహన్‌రావు

ప్రజాశక్తి-ఉయ్యూరు : మహిళలు, బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం సిగ్గుచేటని డీవైఈఓ పద్మారాణి ఆందోళన వ్యక్తంచేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం ఉయ్యూరు, మండల పరిధిలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యా యులకు పోక్స్ చట్టంపై నిర్వహించిన అవగాహన కార్య కమంలో ఆమె మాట్లాడారు. విద్య నేర్పేవారిలో కొందరు బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తిసున్నట్టు ఇటీవల వెలుగులోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. పోక్సో చట్టం పై సవివరంగా తెలియజేసి గుడ్ టచ్, బ్యాడ్చ్ గురి ంచి మండల పరిధిలో ఉపాధ్యాయులు అందరికి ఆదర్శ వంతంగా ఉండాలని ఆకాంక్షించారు. గురువులు దేవుడితో సమానమని, అన్ని విషయాల్లో అప్రమత్తతో ఉండి ఉపా. ధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యాబుద్ధులు నేర్పాలని పట్టణ ఎస్సై విశ్వనాథ్ సూచించారు. బాలలపై లైంగిక దాడులు జరగడం అత్యంత హేయమని యుటీఎఫ్ నాయకుడు పీవీ రమణ, ఆందోళన వ్యక్తంచేశారు. ఐసీడీఎస్ సూపర్వైజర్ బేబీ సరోజిని, న్యాయవాది సుదర్శన్ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : జిల్లా కలెక్టర్ డి. కె.బాలాజీ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులకు పోక్సో చట్టం -2012పై అవగాహన సదస్సు ను మండల పరిషత్ మీటింగు హాలులో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ -1 జి. జగన్మోహన్‌రావు మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో బాలికలపై, మహిళలపై జరుగుతున్న లైంగిక దాడులను అరికట్టాలనే నేపథ్యంలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అనే విషయాలపై అవగాహన కల్పించేందుకుగానూ ప్రధానోపాధ్యా యులకు, ఉపాధ్యాయులకు సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ ఇ. వాణి,ఎస్సై ఎన్ వివి సత్యనారాయణ ఏఎస్ఐ సారథి బాబు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పిఆర్పిలు పాల్గొన్నారు.

ఫొటో ఓటర్ల జాబితాల సవరణ : జెసి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ఫోటో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఫోటోఓటర్ల జాబితాల ఇంటింటి పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ తెలిపారు. జాయింట్ కలెక్టర్ గురువారం తమ ఛాంబర్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించి, వారికి జిల్లాలో నిర్వహిస్తున్న ఫోటోఓటర్ల జాబితాల ప్రత్యేక సంక్షేప్తి సవరణ కార్యక్రమం షెడ్యూల్ వివరించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ఫోటోఓటర్ల జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం చేపట్టామన్నారు. ఇందులో భాగంగా ఫోటో ఓటర్ల జాబితాల డోర్ టు డోర్ వెరిఫి కేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు, ఈ కార్యక్రమం పై ముందుగా బిఎల్ఓ లకు తగిన అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. డోర్ టు డోర్ వెరిఫికేషన్ లో మరణించిన ఓటర్ పేరు జాబితా నుండి తొలగించడానికి, షిఫ్ట్ అయితే సవరించడానికి, 18 సంవత్సరాలు దాటిన వారిని కొత్త ఓటర్ గా ఫారం-6 ద్వారా నమోదు చేయడానికి, జాబితాలలో సరిగా ఫోటోలు కనిపించక పోయిన, తప్పులు ఉన్న నిబంధనల మేరకు సవరణ చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 29 నాటికి పూర్తి చేసి సమగ్ర ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటిస్తామన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ శ్రీదేవి, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బత్తిన దాసు (తెలుగుదేశం), పంతం గజేంద్ర (బిజెపి), సిలార్ దాదా (వైసిపి), కొడాలి శర్మ (సిపిఎం), బాలాజీ (బి.ఎస్.పి), కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు చర్యలు : సిపి


సదస్సులో మాట్లాడుతున్న సిపి రాజశేఖర్‌బాబు

ప్రజాశక్తి-వన్‌టౌన్: సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీస్ శాఖ త్రికరణ శుద్ధితో పనిచేస్తుందని నగర పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు అన్నారు. పోటీ ప్రపంచంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నేరాలను అదుపు చేసేందుకు నూతన సంస్కరణతో ముందుకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. విజయవాడ పోలీసు కమిషనరేట్, కాకరపర్తి భావనారాయణ కళాశాల, లయిన్స్ ఇంటర్నేషనల్ సంయుక్త ఆధ్వర్యంలో సైబర్ నేరాలు - రోడ్డు ప్రమాదాలపై అవగాహనా సదస్సు, హెల్మెట్‌తో బైక్ ర్యాలీ కార్యక్రమాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేబీఎన్ కళాశాల సెమినార్ హాల్‌లో జరిగిన సదస్సులో కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ సైబర్ నేరాలపై అందరికీ అవగాహన కల్పించడానికి పలు చర్యలు చేపట్టామన్నారు. నేరాలు జరిగే తీరు, వాటిని నివారించేందుకు ఏ విధమైన అవగాహనతో ఉండాలనే అంశాలను వివిధ స్థాయిల్లో ప్రచారం చేస్తున్నామన్నారు. అంతేకాకుండా ప్రతి ఒక్కరూ తమ తమ డిజిటల్ పరికరాలకు సంబంధించి అవగాహనతో ఉండే విధంగా చూస్తున్నామన్నారు. అలాగే నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రదాదాలపై అవగాహన కల్పించే లక్ష్యంతో మోటార్ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఈ నూతన వ్యవస్థలో 200 మంది సైబర్ కమాండోలు విధులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం రెండు లక్షల మంది సభ్యులుగా ఉన్నారని సిపి వివరించారు. కేబిన్ కళాశాలలో 300 మంది సైబర్ సోల్జర్స్ ఉన్నట్లు ఆయన తెలిపారు. కాలానుగుణంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాధ్యమైనంత వరకు నేరాలను అదుపు చేసేందుకు పోలీస్ శాఖ త్రికరణ శుద్ధితో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీలు జీ. రామకష్ణ, టీ. హరికష్ణ, కే. చక్రవర్తి, అడిషనల్ డీసీపీ ఏవీఎల్ ప్రసన్నకుమార్ ఏసీపీ రాజారావు, ఎస్‌డీ తేజేశ్వరరావు, సీఐలు కొండలరావు (కొత్తపేట), ఉమామహేశ్వరరావు (భవానీపురం) కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాసు, హిందూ హైస్కూల్స్ విద్యాసంస్థల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వీ. నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎంఎస్‌హెచ్‌ఎఆర్‌తో విజయ ఇనిస్టిట్యూట్ ఒప్పందం

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: ఎంఎస్‌హెచ్‌ఎఆర్ కంపెనీతో నిడమానూరులోని విజయ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫర్ ఉమన్ ఒప్పందం చేసుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.జి. చెంచమ్మ బుధవారం ఓ ప్రకటన తెలిపారు. విఐటిడబ్ల్యు కళాశాలతో ఒప్పందం చేసుకున్న పత్రాలను కంపెనీ ప్రతినిధులు ప్రిన్సిపాల్‌కు అందజేశారు. ఎంఎస్‌హెచ్‌ఎఆర్ కంపెనీ తరపున ఎఐఎంఎల్ విభాగాధిపతి డా.కె.మురళి హాజరై ఈ పత్రాలను బేంథమ్స్ సైన్స్ సిరీస్‌లో ప్రచురిస్తామని, వెబ్ ఆఫ్ సైన్స్ అండ్ స్కోపస్‌లో ఇండెక్స్ చేయబడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డా.టి.రాజసంతోష్ కుమార్, విఐటిడబ్ల్యు వైస్ ప్రిన్సిపల్ డా.వి. రాఘవలక్ష్మి, డీన్ కె.ప్రసూన, విభాగాధిపతులు డా.కె.మురళి (ఎఐఎంఎల్), డా.పి.సుబ్బయ్య (సిఎస్ఇ), డా.టి.విష్ణుప్రియ (ఇసిఇ), వై.విజయ (ఐటి), డా.జి.మధుశ్రీ (ఎంబిఎ) పాల్గొన్నారు.

సిఎంకు ఆర్యవైశ్యుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ పర్వదినం మహోత్సవాన్ని రాష్ట్ర పండుగగా ఆమోదించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు వాసవి ఫౌండేషన్ చైర్మన్ వివికె నరసింహారావు ధన్యవాదాలు తెలిపారు. గురువారం వన్‌టౌన్‌లోని కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వద్దకు ఆర్యవైశ్యుల కోరికను బలంగా తీసుకువెళ్లిన ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు డూండి రాకేష్‌కు అభినందనలు తెలిపారు. ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు నిధులు కేటాయించి బలోపేతం చేయాలని, నిరుపేదలైన ఆర్యవైశ్యులను ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నూకల నాగేశ్వరరావు, వాసవి క్లబ్ గవర్నర్ కెఎల్‌వి. సతీష్, జాలాది వెంకటేశ్వరరావు, నున్న కృష్ణ, సింహాద్రి గోపి, వంకాయల ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడి హుండీల ఆదాయం రూ.2.76 కోట్లు

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడి హుండీల లెక్కింపు కార్యక్రమం గురువారం మహామండపం ఆరో అంతస్తులో జరిగింది. 18 రోజులకు సంబంధించి హుండీలను లెక్కించగా నగదు రూ.2,76,66,261, బంగారం 523 గ్రాములు, వెండి 7.30 కిలోలు వచ్చినట్లు డిప్యూటీ ఈవో లీలాకుమార్ తెలిపారు. విదేశీ కరెన్సీల ద్వారా యుఎస్‌ఎ 327 డాలర్లు, ఆస్ట్రేలియా 35 డాలర్లు, ఇంగ్లాండ్ 10 పౌండ్లు, కెనడా 5 డాలర్లు, కువైట్ 2 దినార్స్, యూరో 25 యూరోలు, మలేషియా 1 రింగ్గిట్స్, సౌదీ 5 రియాల్స్, సింగపూర్ 10 డాలర్స్, కతార్ 98 రియాల్స్ యాత్రికులు సమర్పించారు. ఆన్‌లైన్ ఈ-హుండీ ద్వారా రూ.61,260 యాత్రికులు చెల్లించుకున్నట్లు పేర్కొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి

దుర్గమ్మ దర్శనార్థం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శ్రీసుధ దంపతులు గురువారం ఆలయానికి వచ్చారు. వారికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.



గంజాయి, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలను అరికట్టాలని ధర్నా



ప్రజాశక్తి-భవానీపురం: గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌ల బారినుంచి మా కాలనీని కాపాడాలని స్థానిక మహిళలు గురువారం రోడ్డెక్కి ధర్నాకు దిగారు. వైఎస్ఆర్ కాలనీ ప్రాంతంలో రోజురోజుకూ గంజాయి, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలు ఎక్కువయ్యాయని మహిళలు వాపోతున్నారు. దీంతో గురువారం స్థానికులు, మహిళలు రోడ్డుపైకి చేరి తమ కాలనీలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలను అరికట్టాలని నినదించారు. రాత్రి సమయాల్లో ఇళ్ల వద్దే గంజాయి సేవిస్తూ స్థానిక మహిళలను ఇబ్బంది పెడుతున్నా పట్టించుకున్న పరిస్థితి కనిపించటం లేదని వారు లబో దిబో మంటున్నారు. గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్ వారితో వైఎస్ఆర్ కాలనీ వాసులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బిక్కుబిక్కుమంటూ జీవనం సాగించాల్సి వస్తోందని మహిళలు వాపోతున్నారు. టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వున్నా తమకు రక్షణ లేకుండా పోయిందని అంటున్నారు. రాత్రి అయ్యిందంటే చాలు మద్యం బాబులు, గంజాయి సేవించేవారు రోడ్లపై ఇష్టమొచ్చినట్లు ప్రవర్తిస్తున్నారని, దీంతో పిల్లలు, మహిళలు భయందోళనలు వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక కాలనీలో దోపిడీ, దొంగతనాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని డిమాండ్ చేశారు. రాత్రి సమయంలో పోలీసులు నిఘా కొరవడిందని మహిళల ఆవేదన చెందుతున్నారు. నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు వెంటనే స్పందించి కాలనీలో గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌ల ఆట కట్టించి, రక్షణ కల్పించాలని స్థానిక మహిళలు వేడుకుంటున్నారు.

ఆటోడ్రైవర్లపై అక్రమ కేసులు సరికాదు



ప్రజాశక్తి-వన్‌టౌన్: ఆటో డ్రైవర్లపై విజయవాడ సిటీ పోలీసులు, ఆర్‌టిఎ అధికారులు అక్రమంగా బనాయిస్తున్న కేసులతో ఆటో డ్రైవర్లు ఆర్థికంగా ఎంతో కష్టనష్టాల పాలవుతున్నారని, ఇటువంటి కేసులు సరికాదని విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబుకు విజయవాడ సిటీ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు వడ్లాని మాధవరావు విజ్ఞప్తి చేశారు. గురువారం వన్‌టౌన్‌లోని శంకర్ కేఫ్ సెంటర్ వద్ద ఉన్న తమ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు గాని, ఓనర్లు గాని యూనిఫాం ధరించి విధులను చేస్తూ, లైసెన్సులు, వెహికల్ సంబంధించిన ఇన్సూరెన్స్, ఫిట్నెస్, పొల్యూషన్ వంటి వాటిని సక్రమంగా సకాలంలో చెల్లిస్తున్నామన్నారు. కానీ కొందరు పోలీసు అధికారులు, ఆర్.టి.ఎ. అధికారులు కావాలనే ఉద్దేశపూర్వకంగా ఆటో డ్రైవర్లపై ఏదో ఒక నెపంతో కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. విజయవాడ సిటీకి సమీపంలోని ప్రాంతాల్లో రిజిస్టర్ అయిన ఆటోలపై నగరంలో కేసులు పెడుతూ వేధించడం సరికాదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో అసోసియేషన్ నాయకులు సనకా వెంకటేశ్వరరావు, మజ్జి మురళి, గొరిపర్తి గోపాలకష్ణ, పైలా వెంకటరమణ, లక్ష్మణరావు ,ఈ. సింహాచలం, శానపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమెజాన్ సేవల విస్తరణ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: అమెజాన్ ఇండియా ప్యాకేజీలను విశ్వసనీయతతో అందించేందుకు భారతీయ రైల్వేలతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు అమెజార్ రీజనల్ ఇన్‌ఛార్జి కె.ఎస్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. అమెజాన్ ట్రాన్స్‌పోర్టేషన్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్ ద్వారా రవాణా సేవలను విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అమెజాన్ ద్వారా ప్రతి వినియోగదారులకు వారు కావాల్సిన ప్రదేశాలకు డెలివరీ వేగవంతంగా అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. రానున్న కాలంలో సేవలను మరింత స్థాయిలో విస్తరించేందుకు ఇప్పటికే ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు.

అక్టోబర్ 3న జాగరణ సభ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ఎన్డీఏ కూటమిలో భాగస్వామిగా ఉన్న రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు అండగా ఉంటుందని ఆ పార్టీ మైనారిటీ సెల్ అధ్యక్షులు జాన్ మస్క్ అన్నారు. గవర్నర్ పేటలోని ఒక హోటల్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా మైనారిటీ సెల్ అధ్యక్షులు జాన్ మస్క్ మాట్లాడారు. రాష్ట్రంలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాను బలోపేతం చేసేందుకు గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. అక్టోబర్ 3వ తేదీన విజయవాడలో నిర్వహించే జాగరణ సభకు కేంద్రమంత్రి రాందాస్ అత్వాలే హాజరవుతారన్నారు. ఈ బహిరంగ సభలో పది వేలకు పైచిలుకు కార్యకర్తలు హాజరవుతారని తెలిపారు . ఈ సమావేశంలో మైనార్టీ సెల్ సభ్యులు బి నవీన్‌కుమార్, డేవిడ్ మార్క్, పీటర్,బి. డేనియల్, వివి ప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడా దినోత్సవ వేడుకలు





ప్రజాశక్తి-మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ స్పోర్ట్స్ డేని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాలీబాల్, త్రోబాల్, బ్యాట్మెంటన్ పోటీలను నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టినరోజుని మన దేశ జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్నామని, మన దేశానికి హాకీ రంగంలో ఎనలేని కీర్తిని సంపాదించారన్నారు. ప్రతి ఏటా స్పోర్ట్స్ డే సందర్భంగా కళాశాలలో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రెసిడెంట్ జి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి రమేష్ రెడ్డి ఫిజికల్ డైరెక్టర్ ఎస్వీ రాజకుమార్, ఎస్ దుర్గారెడ్డి, బేబీరాణి పాల్గొన్నారు. **వీరులపాడు:** మండలం పొన్నవరం గ్రామంలో గల ఏకత్వ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు, తెలుగు భాష దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అడపా నాగ సూర్యవతి గురువారం తెలిపారు. ముందుగా పాఠశాల డైరెక్టర్ అమరనేని మనోజ్, వైస్ ప్రిన్సిపాల్ ఐశ్వర్య, ఉపాధ్యాయ బృందంతో కలిసి ధ్యాన్చంద్ సింగ్ చిత్రపటానికి, తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఫౌండర్, డైరెక్టర్ మనోజ్ అమరనేని, తెలుగు ఉపాధ్యాయులు ప్రసన్న యనమదల, సుమలత పోకతోట, అరుణ, పిఈటి నాగమణి, టైక్వాండో శిక్షకులు తండు రత్న కాంత్, ఆర్ట్ టీచర్ శివరామ్, జగదీశ్ పాల్గొన్నారు.